

అచ్యుతాపురం అప్‌గ్రేడ్!

నగర పంచాయతీగా మార్చాలని ప్రతిపాదన

- పక్కనున్న దుప్పితూరు, మోసయ్యపేట, రామన్నపాలెం, వెదురువాడ పంచాయతీలు విలీనం
- ఎమ్మెల్యే సుందరపు చొరవతో ప్రతిపాదనలు తయారు చేసిన అధికారులు
- జనాభా, నివాసాలు, విస్తీర్ణం, తదితర వివరాలతో నివేదిక

అచ్యుతాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):

పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురాన్ని నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేసే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అచ్యుతాపురం చుట్టుపక్కల వున్న దుప్పితూరు, మోసయ్యపేట, రామన్నపాలెం, వెదురువాడ పంచాయతీలను కలిపి నగర పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు ఆయా పంచాయతీల్లో వున్న జనాభా, నివాసాలు, విస్తీర్ణం, తదితర వివరాలతో అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు.



అచ్యుతాపురం జంక్షన్

ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్), బాబా అటమిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్) ఏర్పాటుతో అచ్యుతాపురం మండలం పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నది. ఎస్‌ఈజడ్‌లో చిన్నవి, పెద్దవి కలిసి సుమారు 200 పరిశ్రమలు, కంపెనీలు వున్నాయి. రానున్న రోజుల్లో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌తోపాటు మరికొన్ని పరిశ్రమలు రానున్నాయి. పరిశ్రమలు, కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు స్థానికంగా నివాసం వుండడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో అచ్యుతాపురం, చుట్టుపక్కల గ్రామాల్లో కొత్త భవనాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం జరుగుతున్నది. వీరి అవసరాల కోసం పలు రకాల వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఏర్పాటవుతున్నాయి. ఇంకా వివిధ వృత్తుల వారు ఈ ప్రాంతానికి వచ్చి ఉపాధి పొందుతున్నారు. మొత్తంగా చూస్తే ఈ ప్రాంతంలో జనాభా గణనీయంగా పెరుగుతున్నది. దీంతో తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు 2018లో అచ్యుతాపురాన్ని నగర పంచాయతీగా చేయాలన్న ప్రతిపాదన వచ్చింది. అచ్యుతాపురంతో పాటు పక్కనే వున్న చోడపల్లి, జంగులూరు, భోగాపురం, వెదురువాడ పంచాయతీలను కలిపి నగర పంచాయతీగా అప్‌గేడ్ చేయాలని ప్రతిపాదించారు. దీనిపై జిల్లా అధికారులు నివేదికను కూడా తయారు చేశారు. ఇది కార్యరూపం దాల్చేసరికి వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చొరవతో అచ్యుతాపురం నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేయడంపై కదలిక వచ్చింది.

కాగా గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను విభజించడంతో చోడపల్లి పంచాయతీ పరిధిలో వున్న రామన్నపాలెం, మోసయ్యపేట కొత్త పంచాయతీలుగా ఆవిర్భవించాయి. వెదురువాడ... మిగతా 8వ పేజీలో

నేడు మాజీ సీఎం జగన్ రాక



అనకాపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి గురువారం మాకవరపాలెంలో నిర్మాణంలో ఆగిపోయిన మెడికల్ కాలేజీని సందర్శించనున్నారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం గన్నవరం నుంచి ఉదయం 11 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి 11.30 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి ఎన్ఏడీ కొత్త రోడ్డు, పెందుర్తి మీదుగా అనకాపల్లి మండలం కొత్తూరు జంక్షన్‌కు చేరుకుంటారు. ఇక్కడ కార్యకర్తలతో సమావేశమైన అనంతరం రోడ్డు మార్గంలో తాళ్లపాలెం జంక్షన్‌కు చేరుకుంటారు. ఇక్కడ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడతారు. అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు మాకవరపాలెం చేరుకుంటారు. అసంపూర్తిగా వున్న మెడికల్ కాలేజీని సందర్శించి మీడియాతో మాట్లాడతారు. 2.45 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 4.15 గంటలకు విశాఖ చేరుకుంటారు. 4.45 గంటలకు విమానంలో బయలుదేరి బెంగళూరు వెళతారు.

నూకాంబిక హుండీ ఆదాయం
రూ. 52.34 లక్షలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ హుండీల లెక్కింపు బుధవారం జరిగింది. జూన్ 16 నుంచి బుధవారం వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.52,34,361 నగదు, 18.5 గ్రాముల బంగారం, 1.4 కిలోల వెండి వచ్చినట్టు ఆలయ ఇన్‌చార్జి ఈవో కేఎల్ సుధారాణి, మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను తెలిపారు. డీఏఎస్ సురేశ్ బాబు పర్యవేక్షణలో జరిగిన హుండీ కానుకల లెక్కింపులో అర్చకులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

రహదారులకు మహర్దశ!

రెండు స్టేట్ హైవే రోడ్లు, 9 జిల్లా రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు

- మొత్తం రూ.43.2 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు
- వివిధ ప్రాంతాల్లో 100 కిలోమీటర్ల మేర మారనున్న రహదారుల రూపురేఖలు
- టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభం

అనకాపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో పలు రహదారుల అభివృద్ధి, నిర్వహణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసింది. ఆర్అండ్‌బీ పరిధిలో రెండు రాష్ట్ర రహదారులు, తొమ్మిది జిల్లా రహదారులను వివిధచోట్ల అభివృద్ధి చేసేందుకు రూ.43 కోట్లకుపైగా కేటాయించింది. జిల్లాలోని దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు వంద కిలోమీటర్ల మేర రోడ్ల రూపురేఖలు మారనున్నాయి.



రూ.4.6 కోట్లతో అభివృద్ధి చేయనున్న కోటవురట్ల మండలం కైలాసపట్నం నుంచి మాకవరపాలెం మండలం రాచపల్లి వెళ్లే రోడ్డు

రహదారుల విస్తరణ, అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. గత వైసీపీ పాలనలో అధ్వానంగా మారిన పలు ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికిఇ ఇప్పుడు కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసింది. జిల్లాలో వివిధ మండలాల్లో జాతీయ, రాష్ట్ర రహదారుల కనెక్టివిటీతోపాటు ఇతర రోడ్లకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది. ఈ మేరకు రవాణా, ఆర్అండ్‌బీ శాఖల ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర రహదారుల విషయానికి వస్తే.. భీమిలి-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో సబ్బవరం మండలం లింగాల తిరుగుడు గ్రామం నుంచి చోడవరం మండలం వెంకన్నపాలెం వరకు 8.6 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధికి రూ.3.5 కోట్లు, ఎలమంచిలి- గాజువాక రోడ్డులో రాంబిల్లి, పరవాడ మండలాల పరిధిలో మూడుచోట్ల ఏడు కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.3.5 కోట్లు కేటాయించారు. ఇక జిల్లా రహదారుల వివరాలను పరిశీలిస్తే.. కోటవురట్ల మండలం కైలాసపట్నం నుంచి చౌడువాడ, నగరం, కోడూరు మీదుగా మాకవరపాలెం మండలం రాచపల్లి వరకు రెండుచోట్ల 8.77 కిలోమీటర్ల పొడవున అభివృద్ధి పనులకు రూ.4.6 కోట్లు, మాకవరపాలెం మండలం కొండల అగ్రహారం, లచ్చన్నపాలెం, కుసర్లపూడి మీదుగా రోలుగుంట వరకు ఎనిమిది కి.మీ.ల అభివృద్ధికి రూ.2.6 కోట్లు, అనకాపల్లి మండలం తుమ్మపాల నుంచి దిబ్బపాలెం, ఊడేరు వరకు 7.6 కి.మీ.ల రోడ్డుకు రూ.3 కోట్లు కేటాయించారు. ఎస్.రాయవరం మండలం రేవు పోలవరం నుంచి బంగారమ్మపాలెం వరకు, నక్కపల్లి మండలం ఉద్దండపురం నుంచి నెల్లిపాడు, గుల్లిపాడు, రేబాక మీదుగా తిరుపతిపాలెం వరకు మొత్తం 13 కి.మీ.ల మేర రోడ్ల అభివృద్ధికి రూ.7.6 కోట్లు, నక్కపల్లి మండలం సరిపల్లిపాలెం నుంచి సీహెచ్ఎల్ఎన్ పురం, తీనార్ల, దొండవాక మీదుగా రాజయ్యపేట వరకు 6.97 కి.మీ.ల రోడ్డుకు రూ.3 కోట్లు, పాయకరావుపేట మండలం ఈదటం నుంచి పాల్మన్‌పేట మీదుగా వెంకటనగరం వరకు, ఎస్.రాయవరం నుంచి బంగారమ్మపాలెం వరకు, తుని ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పాయకరావుపేట మండలంలో పాల్తేరు మీదుగా పాల్మన్‌పేట వరకు 11 కి.మీ.ల రోడ్ల అభివృద్ధికి రూ.5 కోట్లు, పరవాడ మండలంలో పి.బోనంగి, కలపాక, దలాయిపాలెం వరకు 13 కి.మీ.ల రోడ్డు అభివృద్ధికి రూ.4.4 కోట్లు, ఎలమంచిలి మండలం పి.ధర్మవరం నుంచి ఎలమంచిలి వరకు, జాతీయ రహదారి నుంచి జంపపాలెం వరకు మొత్తం 8 కి.మీ.ల మేర రోడ్ల అభివృద్ధికి రూ.3.5 కోట్లు, దేవరాపల్లి నుంచి తెనుగుపూడి మీదుగా తిమిరాం వరకు ఏడు కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.2.5 కోట్లు కేటాయించారు. ఆయా రహదారుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం త్వరలో టెండర్లు పిలుస్తుందని ఆర్అండ్‌బీ ఈఈ నందమూరి సాంబశివరావు తెలిపారు. ఇప్పటికే పరిపాలనపరమైన ఆమోదం లభించినందున టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.



రూ.3.5 కోట్లతో అభివృద్ధి చేయనున్న లింగాలతిరుగుడు- వెంకన్నపాలెం రోడ్డు

ఎలమంచిలి ఎంపీపీపై 18న అవిశ్వాస తీర్మానం

సభ్యులకు సమాచారం అందించిన మండల పరిషత్ అధికారులు

- మొత్తం ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు
- ఎంపీపీ గోవిందరావుకు వ్యతిరేకంగా నలుగురు..
- అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని ప్రత్యర్థుల ధీమా

ఎలమంచిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):

ఎలమంచిలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షునిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఈ నెల 18వ తేదీన సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఎంపీటీసీ సభ్యులకు బుధవారం సమాచారం అందించారు. ఎంపీపీగా బోదెపు గోవిందరావు కొనసాగుతారా? లేకపోతే గద్దె దిగుతారా? అన్నది ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు జరిగే బలపరీక్షలో తేలిపోతుంది.

ఎలమంచిలి మండలంలో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైసీపీ అభ్యర్థులే గెలుపొందారు. అనంతరం ఎంపీపీగా బోదెపు గోవిందరావు, వైస్‌ఎంపీపీలుగా రాజాన శేషు, శిలపరశెట్టి ఉమ ఎంపికయ్యారు. కొంతకాలం తరువాత ఏటికొప్పాక-2 సభ్యురాలు నగిరెడ్డి దేముడమ్మ మృతిచెందడంతో ఆ స్థానం ఖాళీగా వుంది. ఇదిలావుండగా వైస్ ఎంపీపీ రాజాన శేషు ఎంపీపీ పదవిని ఆశించారు. కానీ దక్కకపోవడంతో నిరాశ చెందారు. గత ఏడాది సాధారణ ఎన్నికల తరువాత వైస్ ఎంపీపీలు రాజాన శేషు, ఎస్.ఉమ జనసేన పార్టీలో చేరారు. మరో ఇద్దరు సభ్యులు నగిరెడ్డి అమ్మాజీ (ఏటికొప్పాక-1), బర్రె శివలక్ష్మి(కొత్తలి)లతో కలిసి ఎంపీపీ గోవిందరావును పదవి నుంచి దించేయాలని నిర్ణయించుకున్నారు. గత నెల 24వ తేదీన సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మాన నోటీసును అనకాపల్లి ఆర్డీవోతో పాటు ఎలమంచిలి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావుకు అందజేశారు. మొత్తం ఆరుగురు సభ్యులకుగాను నలుగురు సంతకాలు చేయడంతో ఎంపీపీ ... మిగతా 8వ పేజీలో



ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావుకు గత నెల 24న ఎంపీపీపై అవిశ్వాస నోటీసును అందజేస్తున్న వైస్ ఎంపీపీలు రాజాన శేషు, ఎస్.ఉమ, ఎంపీటీసీ సభ్యులు అమ్మాజీ, శివలక్ష్మి

కొత్త టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్

నేడు ఆప్షన్ ఇచ్చుకునే అవకాశం

- రేపు పాఠశాలల కేటాయింపు... నియామక ఉత్తర్వులు
- తొలుత ఏజెన్సీలో ఖాళీల భర్తీపై విద్యా శాఖ దృష్టి

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త టీచర్లకు వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలు కేటాయించనున్నారు. ఇందుకుగాను గురువారం వెబ్ ఆప్షన్స్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నారు. బుధవారమే వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఇస్తామని తొలుత ప్రకటించారు. అయితే ఖాళీల సమాచారం అందడం ఆలస్యం కావడంతో గురువారానికి వాయిదా వేశారు. గురువారం వెబ్ ఆప్షన్స్ పూర్తయిన తరువాత శుక్రవారం పాఠశాలలు కేటాయించనున్నారు. అదేరోజు నియామక ఉత్తర్వులు అందిస్తారు.ఉమ్మడి జిల్లాలో ఐదుచోట్ల కొత్త టీచర్లకు ఈనెల మూడో తేదీ నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఆరోజు నుంచి సర్వీస్ ప్రారంభం అయినట్టే. కాగా ఉమ్మడి జిల్లాలో 1,134 పోస్టులకు భర్తీచేశారు. అందులో 400 పోస్టులు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఏజెన్సీ పాఠశాలల్లోనివి. ఇక ... మిగతా 8వ పేజీలో

పెద్దేరుకు వరద తాకిడి

- జలాశయం నుంచి 450 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతున్నది. పరీవాహక ప్రాంతమైన ఏజెన్సీలోని పాడేరు, జి.మాడుగులతోపాటు మండలంలోని గిరిజన ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో జలాశయంలోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా బుధవారం 495 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. దీంతో నీటిమట్టం 136.55 మీటర్లకు చేరింది. ముందు జాగ్రత్తచర్యగా రాత్రి పది గంటలకు స్పిల్‌వేలో మూడో నంబరు గేటు ఎత్తి 450 క్యూసెక్కుల నీటిని పెద్దేరు నదిలోకి విడుదల చేస్తున్నట్టు జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. అందువల్ల మాడుగుల, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాల్లో నదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఆయన కోరారు.

గంజాయి కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా

చోడవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో ముద్దాయికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ స్థానిక 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరి నారాయణ బుధవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి పూర్వాపరాలిలా వున్నాయి.

మాడుగుల మండలం ముకుందపురం గ్రామానికి చెందిన ప్రగడ గణేశ్ 2015వ సంవత్సరం నవంబరు 11వ తేదీన కారులో సుమారు 100 కిలోల గంజాయి రవాణా చేస్తున్నాడు. అప్పటి చోడవరం ఎస్ఐ బి.రమణయ్య స్థానిక కొత్తూరు జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా గణేశ్‌ను గంజాయితో సహా పట్టుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అనంతరం పోలీసు కేసు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జీషీటు దాఖలు చేశారు. పోలీసు శాఖ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యు.వెంకటరావు కోర్టులో సమర్థంగా వాదనలు వినిపించారు. పోలీసులు మోపిన అభియోగం వాస్తవమని నిర్ధారణకు వచ్చిన స్థానిక 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ.. ముద్దాయి గణేశ్‌కు పదేళ్ల జైలు శిక్షతో పాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు.

మహిళా క్రికెట్ సందడి

ప్రపంచ కప్ టోర్నీకి తొలిసారి వేదికగా నిలుస్తున్న ఏసీఏ-వీడీసీఏ స్టేడియం

- నేడు భారత్, దక్షిణాఫ్రికా మధ్య పోరు



విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీకి తొలిసారి వేదికగా నిలుస్తున్న పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. గురువారం జరగనున్న మ్యాచ్‌లో ఆతిథ్య భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై, రెండో మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై వరుస విజయాలు సాధించిన భారత జట్టు గురువారం దక్షిణాఫ్రికాతో జరగనున్న మ్యాచ్‌లో ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది. ఇక తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో ఘోరంగా ఓడిన దక్షిణాఫ్రికా...రెండో మ్యాచ్‌లో అనూహ్యంగా పుంజుకుని న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించడంతో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంది. ఇక్కడి పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే అవకాశాలున్నాయని క్రీడా నిపుణులు చెబుతున్నారు. టాస్ కీలకంగా మారే ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌కు 250కు పైగా స్కోరు చేసే అవకాశాలు ఉన్నాయి.

మహిళ ప్రేక్షకుల కోసం ప్రత్యేక చర్యలు

మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చే మహిళా అభిమానుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యేకంగా వాష్ రూమ్స్ ఏర్పాటు చేశారు. పురుషులతో నిమిత్తం లేకుండా ప్రత్యేక మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా అక్కడ తగిన భద్రత చర్యలు చేపట్టనున్నారు.

భారీ బందోబస్తు

స్టేడియం బయట, లోపల ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటుచేసింది. అలాగే ట్రాఫిక్‌కు సంబంధించి ప్రత్యేక నిబంధనలు అమలు చేయనుంది.

సాంబమూర్తి శూలాల ఉత్సవ రాట



ఉత్సవ రాట వేడుకలో పాల్గొన్న భక్తులు

మునగపాక, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీసాంబమూర్తి శులాల ఉత్సవరాట వేడుక సంప్రదాయబద్ధంగా జరిగింది. ఈ దేవస్థానానికి సమీపంలో ఉత్సవ గుమ్మటం తయారీ ప్రాం తంలో బుధవారం ఈ రాట వేశారు. ఈ సందర్భంగా దేవ స్థానం కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు మాట్లాడుతూ నవం బర్ 3వ తేదీన శూలాల పండగ నిర్వహిస్తామన్నారు.

ఈ-పంట నమోదుకు 25 వరకు గడువు



పంచదార్లలో రైతులతో మాట్లాడుతున్న ఏవో సుమంత

రాంబిల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ఈ నెల 25 లోగా రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత తెలిపారు. బుధవారం ఆమె పంచ దార్లలో ఈ పంట నమోదు కార్యక్రమంను పరిశీలించారు. రైతు లకు పలు వ్యవసాయ సూచనలు చేశారు. మండలంలోని 7845 ఎకరాల సాగు విస్తీర్ణంలో 4971 ఎకరాలు వ్యవసాయ సిబ్బంది ద్వారా ఈ పంట నమోదు చేసినట్టు చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల్లో పంట పరిహారం, వ్యవసాయ పరికరాల సబ్సిడీ , ధాన్యం కొనుగోలు తదితర వాటికి ఈ పంట నమోదు ఉపయోగపడుతుందన్నారు. అలాగే, రైతు సేవా కేంద్రాల ద్వారా 421 టన్నులు యూరియా, 36 టన్నుల డీఏపీ 20 టన్నులు ఎం ఓపీ రైతులకు అందించామ న్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు జంపపాలెం గ్రామదేవత జాతర



జాతర సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో జట్లు

ఎలమంచిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపపా లెం గ్రామదేవత మరిడిమాంబ జాతరను గురువారం నిర్వహించ నున్నారు. అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిం చారు. అలాగే, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో గ్రామ పెద్దలు, యువత ప్రారంభించారు. జిల్లా నలుమూలలు నుంచి సుమారు 16 జట్లు టోర్నీకి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలను పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు త రలివచ్చి వీక్షించారు.

సెపక్ తక్రా జిల్లా జట్టు ఎంపిక



సెపక్ తక్రా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అచ్యుతాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ జూనియర్ 29 వ సెపక్‌తక్రా ఛాంపియన్ షిప్-2025లో పాల్గొననున్న అనకాపల్లి జిల్లా జట్టును బుధవారం స్థానిక కైట్స్ విద్యావిహార్ స్కూల్‌లో ఎంపిక చేశారు. ఎంపికైన వీరు ఈనెల 11,12 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంటులో పాల్గొంటారు. ఈ కార్య క్రమంలో సెపక్‌తక్రా అనకాపల్లి జిల్లా కార్యదర్శి ప్రవీణ్, కోచ్ శివ, పాఠశాల కరస్పాండెంట్ గణేష్, ప్రిన్సిపాల్ ప్రసన్న పాల్గొన్నారు.

పంపు ఆపరేటర్ల బకాయి వేతనాలు చెల్లించాలి



కార్యదర్శికి పంపు ఆపరేటర్‌లతో కలిసి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నేత

రాంబిల్లి, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): మండలం లోని జడ్ చింతువా పంచాయతీ పరిధి ని లోవపాలెం, గజి రెడ్డిపాలెం, వెంక య్యపాలెం గ్రామా లకు తాగునీటి సర ఫరా చేసే పంప్ ఆపరేటర్లకు బకాయి జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్య దర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆయా గ్రామాల పంప్ ఆపరేటర్‌లతో కలిసి పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లుగా పంప్ ఆపరేటర్లకు వేతనాలులేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్య తీసుకువెళ్లినా పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి బకాయి జీతాలను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాలతో భవిష్యత్తు నాశనం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సత్యవతి

నక్కపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వివాహ వయస్సు రాకుండా ఆడ పిల్లలు బాల్య వివాహాలు చేసుకుంటే ఉజ్వలమైన భవిష్యత్తు నాశనమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.సత్యవతి స్పష్టం చేశారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధ వారం నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియా వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అలాగే గుడ్ టచ్.. బాడ్ టచ్, బాలికల హక్కులు, తదితర అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. అనంతరం బాలికల దినోత్సవంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడ్ సంస్థ ప్రతినిధి అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు కోసం ‘నేను..నా యువత’

» ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్ జనసేన నేతలు

ఎలమంచిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల కోసం ‘నే ను..నా యువత’ పేరిట కార్యక్రమాన్ని ఈ నెల 12 వ తేదీన తొలిసారి గా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే విజయ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ అతిథిగృహంలో స్థానిక జనసేన నే తలతో కలిసి ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ఈ నెల 12 న రాంబిల్లి మండలం వెంకటాపురం లోని జనసేన పార్టీ కార్యాలయంలో ‘నేను..నా యువత’ ప్రారంభిస్తా మన్నారు. 18 నుంచి 40 ఏళ్ల లోపున్న యువత ముందుగా ఫోన్: 75778 87777లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యువత పా ల్గొని అభిప్రాయాలను వ్యక్తం చేయాలన్నారు. వారి ఆలోచనలు, ఆశయాలు, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ముందుకు వెళ్తామన్నారు. ప్రధానం గా యువతను పాలనలో భాగంచేయడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్య క్రమంలో పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, జనసేన నేతలు శ్రీ రామదాసు, ల వుడు లోవరాజు, జనపరెడ్డి శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు మోటూరు గోపీ, లాలం సోమునాయుడులు పాల్గొన్నారు.

జనవాణిలో వినతులు స్వీకరణ

ఎలమంచిలి: ప్రజా సమస్యలు సత్వర పరిష్కారమే ధ్యేయంగా జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే విజయ్ కుమార్ అన్నారు. బుధ వారం పట్టణంలోని జడ్పీ అతిథి గృహంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరి నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగు మండలాల నుంచి వస్తున్న వినతులు పరి ష్కారంలో అధికారులు జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఇతర అధికా రులు, కూటమి నేతలు బొద్దపు శ్రీను, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, లవుడు లోవరాజు, రాజాన నారాయణమ్మ, గొర్లె నానాజీ, చిట్టిబాబు, మోటూరు గోపీ, లాలం సోమునాయుడులు పాల్గొన్నారు.

అలజడులు సృష్టించేందుకే జగన్ పర్యటన

» మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న చలపతి రావు

అచ్యుతాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో అలజడులు సృ ష్టించటానికే వైసీపీ అధినేత జగన్ ఈ ప్రాంత పర్యటనకు వస్తున్నారని మా జీ ఎమ్మెల్సీ పప్పల చలపతి రావు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాల యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ఐదేళ్ల అధికారం లో తీవ్ర విధ్వంసం సృష్టించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వ ప్రజారంజక పాలనతో తనకు భవిష్యత్తు ఉండదని తెలిసి ఆయన నాటకాలు ఆడుతున్నా రన్నారు. ప్రజలు అమాయకులు కారని గత ప్రభుత్వ పాలన, కూటమి ప్ర భుత్వ పాలనను బేరీజు వేసుకున్నారన్నారు. మెడికల్ కాలేజీలపై జగన్ అ సంబద్ధ ప్రచారం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్, సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలను ప్రతి ఇంటికి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కె. అప్పారావు, దేశంశెట్టి వెంకట రమణ, రెడ్డి నగేష్, పి .కొండబాబు, జగ్గప్పారావు, లాలం రాజు, పుర్రే శ్రీనివాస యాదవ్, యాండ్ర అప్పలనాయుడు, లాలం రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి నష్టం కలిగించేలా నిర్ణయాలు

మునగపాక: ఆంధ్రప్రదేశ్‌కు నష్టం కలిగించే విధంగా మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయాలు ఉం టున్నాయని ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు ఆరోపించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో వైనాట్ 175 అంటూ అహంభూరిత ప్రసంగాలు చేసిన జగన్‌కు ప్రజలు 11 సీట్లతో గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. కూటమి పాలనలో అభివృద్ధి చూసి ఓర్వలేకనే పర్యటనలు పేరుతో విధ్వంసకర ఆలోచనలకు పాల్పడుతున్నా రన్నారు. ఇదే వైఖరితో ఉంటే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఒక్కసీటు కూడా దక్క దని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో మా దిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

» గ్రామసభలో సర్పంచ్ గారా ఉషశ్రీ



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ గారా ఉషశ్రీ

పాయకరావుపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ సభలో ప్రజలు తెలియజేసిన సమస్యల సరిష్కారానికి అధికారులు కృషిచేయాలని సర్పంచ్ గారా ఉషశ్రీ సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సహాయ సహకారాలు అందించాలని కోరారు. పంచాయతీకి సంబంధించి ఇంటి పన్నులు, ఇతర పనులకు సంబంధించి ప్రజలు అడిగిన ప్రశ్నలకు సిబ్బంది అన్ని వివరాలతో సమాధానం చెప్పాలన్నారు. అంతకుముందు గ్రామానికి చెందిన ఆడారి నూకరాజు మాట్లాడుతూ పట్టణంలో మురికినీరు ప్రధాన కాలువల ద్వారా ప్రవహించక ఇళ్లల్లోకి వస్తోందని వాపోయారు. తాటిపాక లోవరాజు మాట్లాడుతూ 13వ వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని కోరారు. చిక్కాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణంలో రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ నాయకుడు జగతా శ్రీను మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తెలియజేసే గ్రామసభకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించేలా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేయాలని కోరారు. దగ్గుపల్లి సాయిబాబా మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు.

వీటిపై డిప్యూటీ ఎంపీడీవో, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి కె.డేవిడ్ స్పందిస్తూ, గ్రామ సభలో వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ, పెంకే గోవిందు, పల్లా ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డరోడ్డు జంక్షన్‌లో ఎన్‌టీఆర్ భారీ విగ్రహం

రాష్ట్ర హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో త్వరలో ఆవిష్కరణ

వైస్ ఎంపీపీ గోవిందరావు, టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి రాజు



టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహం

ఎస్.రాయవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు పంచాయతీ పరిధిలో వ్యాపార కేంద్రమైన అడ్డరోడ్డు జాతీయ రహదారి పై ఓవర్ జంక్షన్ వద్ద బుధవారం తెలు గుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు భారీ విగ్ర హాన్ని నూతనంగా ఏర్పాటు చేసినట్టు వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, టీడీపీ మండల సీనియర్ నాయకుడు సోమిరెడ్డి రాజు తెలిపారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహం చుట్టూ ఉన్న ప్రదేశం వద్ద మరికొన్ని పనులు చేపట్టడంతో పాటు సరికొత్త హంగులతో విగ్రహం ఉన్న ప్రదేశాన్ని సుందరంగా తీర్చిదిద్దడం జరుగు తుందన్నారు. అక్కడి పనులు పూర్తయిన వెంటనే కొద్ది రోజుల్లో మహా నాయకుడు, దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్య క్రమాన్ని మండల కూటమి నాయకుల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుందని గోవిందరావు, రాజు తెలిపారు. అలాగే 11 అడుగుల ఎన్‌టీఆర్ భారీ విగ్రహాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో త్వరలోనే ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామని వారు చెప్పారు.

గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు కృషి

» డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ



దార్లపూడిలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

ఎస్.రాయవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో పరిస రాల పరిశుభ్రతకు కృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీవో బంగారు సత్యనారాయణ పిలుపునిచ్చారు. దార్లపూడి గ్రామంలో బుధవరం పరిసరాల పరిశుభ్రతపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలందరూ తమ ఇళ్ల వద్ద పేరుకుపోయిన చెత్తలో తడి చెత్తను ఒక డాంట్లోను, పొడి చెత్తను మరొక డాంట్లోను వేరు చేసి ఉంచి పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలని కోరారు. అంతకముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు ప్రతీ ఇంటికి తిరు గుతూ తడి చెత్త, పొడి చెత్తల గురించి వివరించారు. అలాగే కరపత్రాలను గోడలకు అంటించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుభాషిణి, కార్యదర్శి మూర్తి, సచివాలయ ఉద్యోగులు, ఐసీడీఎస్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా నాగజ్యోతి

రేలుగుంట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రేలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న అంతర్జాతీయ క్రీడాకారిణి పీఎం నాగజ్యోతి జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా ఎంపికయ్యారు. నేషనల్ పవర్ లిఫ్టర్స్ ఫెడరేషన్ (ఎన్‌పీఎఫ్) ఆమెను ఎంపిక చేసింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్‌పీఎ ఫ్, కర్ణాటక స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్-2025 పోటీలు ఈ నెల 9, 10, 11, 12 తేదీల్లో బెంగ ళూరులో జరగనున్నాయి. ఆయా పోటీల్లో నాగజ్యోతి రిఫరీగా వెళ్లనున్నారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో నాగజ్యోతి అనేక పతకాలు సాధించారు.

వరహా నదిలో పడి వ్యక్తి గల్లంతు

నర్సీపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలోని శాంతి నగర్‌లో నివాసం ఉంటున్న కెల్లా భాస్కర్ (35) బుధవారం గెడ్డలో పడి గల్లంతైనట్టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. నర్సీపట్నంలో బంధువు అంత్యక్రియల కోసం మరి కొంత మందితో భాస్కర్ వెళ్లారని కుటుంబీకులు చెప్పారు. అనంతరం లింగాపురం మార్గంలోని వరహా నదిలోకి దిగగా, ప్రమాదశాత్తు కొట్టుకుపోయినట్టు తెలిపారు. ఈ మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

బల్క్‌డ్రగ్ రద్దు చేసేవరకూ పోరాటం

నక్కపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేసే వరకూ పోరాడతామని మత్స్యకారులు స్పష్టం చేశారు. రాజయ్యపేట కేంద్రంగా మత్స్యకారులు చేస్తున్న నిరసన కార్యక్ర మం బుధవారం నాటికి 25వ రోజుకు చేరుకుంది. సీపీఐ జిల్లా నేత బి.బాబ్జీ, సీపీఎం మత్స్యకార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి చంద్రశేఖర్ సంఘీబావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే హెటెరో పరిశ్రమ వ్యర్థాల వల్ల పరిసర గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. బల్క్ డ్రగ్ పార్కు పేరుతో అనేక రసాయన పరిశ్రమలు వస్తే ఈ ప్రాంత ప్రజల ఆయు ప్రమాణం కూడా తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.



రాజయ్యపేటలో నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

పార్కు కాదు.. సాగునీటి కాలువే!

» తూటిపాదులు అల్లుకోవడంతో సమస్యలు



మునగపాక సంతబయల చాకిరేవు వద్ద సాగునీటి కాలువ దుస్థితి

మునగపాక, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): మునగపాక సంతబయల చాకిరేవు ప్రాంతంలోని సాగునీటి కాలువ పిచ్చి మొక్కలతో నిండి ఉంటోంది. దీంతో ఆయకట్టు భూముల రైతులు ఆందోళన వ్యక్తంచేస్తు న్నారు. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి కాలువలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం సాగునీటి కాలువలు పరిరక్ష ణకు ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ కొన్ని కాలువలు అభివృద్ధికి నోచుకో లేదు. వీటిలో అనకాపల్లి ఆవకాలువ కూడా ఉంది. ఈ కాలువలో కూలిన చెట్లు, తుప్పలు, పాదులు ఉండడంతో అవి ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహానికి విఘాతమవుతున్నాయి. చాలా చోట్ల పచ్చటి తూటిపాదులు కాలువ మొత్తాన్ని అల్లుకొని ఉన్నాయి. వీటితో పొలాలు నీటి ముంపునకు గురవుతు న్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలి: ఎమ్మెల్యే



నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్యుతాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాప ల్లి రోడ్డు విస్తరణ పనులు త్వరిత గతిన చేపట్టాలని ఎమ్మెల్యే సుంద రపు విజయ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయ న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. నాణ్యతతో చేపట్టాలని కో రారు. ప్రస్తుతం ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఈ నిర్మాణ పనులు వేగం గా పూర్తి చేయాలని కోరారు. పనులు జరిగే తీరును అధికారులు ఎ మ్మెల్యే వివరించారు.

పశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపండి



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి ఉమామహేశ్వరి

అచ్యుతాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పశు సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని దోసూరు పశువైద్యాధికారిణి ఉమా మహేశ్వరి అన్నారు. బుధవారం రాజానపాలెంలో జరిగిన ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గాలికుంటు వ్యాధి వచ్చేఅవకాశం ఉందన్నారు. పశువులకు ఏమాత్రం అస్వస్థతగా ఉన్నా తమను వెంటనే సంప్రదించాలన్నారు. ఈసంద ర్భంగా 150 పశువులకు టీకాలు వేశారు. లేగదూడల నట్టల నివారణ మందులు ఉచితంగా ఇచ్చారు. ఈకార్యక్రమంలో రాజాన నానాజీ, రా జాన అప్పారావు మాష్టారు, డాక్టర్ అరుణ, సంతోష్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌టీపై విద్యార్థులకు అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

నక్కపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో డి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో కె.చలపతిరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీని తగ్గించడం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్‌పై కళాశాల విద్యార్థులు విపులంగా తెలుసుకోవాలని వారు సూచించారు. అనంతరం నక్కపల్లిలో అవగాహనా ర్యాలీ చేపట్టారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, అధ్యాపకులు భీమసేన, ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

జన సైనికుల ఉదారత



వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందిస్తున్న జన సైనికులు

నక్కపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకయ్య పేట గ్రామానికి చెందిన జన సైనికులు ఆపదలో వున్న వారిని ఆదు కోవడంలో ముందుంటున్నారు. తాజాగా క్యాన్సర్‌తో బాధపడుతున్న యువకుడి కుటుంబానికి జనసేన జిల్లా జాయింట్ సెక్రటరీ కురం దాసు అప్పలరాజు ఆధ్వర్యంలో బుధవారం జనసైనికులు రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. వైద్య ఖర్చులు, పోషకాహారం కోసం ఈ మొత్తాన్ని వెచ్చించాలని, భవిష్యత్‌లో తమ సేవా కార్యక్ర మాలను మరింత విస్తృత పరుస్తామని అప్పలరాజు చెప్పారు.

గురుకుల విద్యార్థిని అదృశ్యంపై కేసు

నక్కపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఏడో తరగతి చదువుతున్న ఒక బాలిక గురుకులం ప్రహరీ గోడ దూకి బయటకు వెళ్లినట్టు గురుకులం సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు బుధ వారం రాత్రి ఎస్‌ఐ సన్నిబాబు స్థానిక విలేకర్లకు చెప్పారు. మాకవర పాలెం మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన ఒక బాలిక నక్కపల్లి బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఏడో తరగగతి చదువుతున్నట్టు చె ప్పారు. దసరా సెలవుల అనంతరం ఇంటి నుంచి మంగళవారం సాయంత్రం ఆ బాలిక గురుకులానికి వచ్చిందన్నారు. మంగళవారం రాత్రి 10-30 గంటల ప్రాంతంలో ఆ బాలిక స్కూల్ ప్రహరీ గోడ దూకి పరారైనట్టు చెప్పారు. ఆ బాలిక బుధవారం రాత్రి వరకూ ఇంటికిగాని, స్కూల్‌కుగాని రాకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు.

సమష్టిగా సమస్యలు పరిష్కారం

▸▸ కశింకోట మండల సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్

▸▸ గ్రామాల్లో పరిస్థితులను సభలో ప్రస్తావించిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్, చిత్రంలో ఎంపీపీ లక్ష్మి

కశింకోట, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సమష్టిగా పనిచేయాలని ఎంపీడీవో చుక్క చంద్రశేఖరరావు సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కలగ లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశ ఏర్పాటైంది. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గ్రామాల్లో సమస్యలను సభదృష్టికి తీసుకు వచ్చారు. ప్రధానంగా కశింకోటలోలో వోల్టేజీ సమస్య ఉందని, తక్షణమే పరిష్కారం చూపాలని పలువురు కోరారు. దీనిపై ఎంపీడీవో స్పందించి ఇప్పటికే ఏపీఈపీడీసీఎల్ అధికారులతో సంప్రదింపులు జరిపామని చెప్పారు. అదే విధంగా గ్రామాల్లో తాగునీరు సమస్య లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని, ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లించాలని కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు. ఈ మావేశంలో వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడుతో పాటు పదిహేను మంది సర్పంచులు, పన్నెండు మంది ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏఎంసీ కాలనీలో దోమ తెరల పంపిణీ



దోమ తెరలు పంపిణీ చేస్తున్న చైర్మన్ సురేంద్ర, జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామరాజుపేట ఏఎంసీ కాలనీలో బుధవారం దోమ తెరలను పంపిణీ చేశారు. ప్రజలు మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టర్ విజయకృష్ణన్ జీవీఎంసీ అనకాపల్లి జోన్‌కు కేటాయించిన దోమ తెరలను ఐదు వందల మంది కుటుంబాలకు గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి అందజేశారు. అనంతరం డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు బొద్దపు ప్రసాద్, మంగా ఈశ్వర్, ఎస్.భానుచందర్, పిట్ల రాజు, బొమ్మల దేవి, మలేరియా విభాగం అధికారి కోదండ రామ్, జీవీఎంసీ శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలపై వినతి



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధుల

అనకాపల్లి టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ ప్రతినిధులు బుధవారం రాజధానిలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు వినతి పత్రం అందజేశారు. గొర్రెలు, మేకల పెంపకందారులకు యాభై శాతం సబ్సిడీతో రూ.ఐదు లక్షలు రుణం మంజూరు చేయాలని, ఎన్‌సీడీసీ రెండో విడత విడుదల చేసిన రూ.88 కోట్లను వెంటనే ఖర్చు చేయాలని, మూడో విడత రూ.120 కోట్లు నిధులు వచ్చే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్, విశాఖ ఉమ్మడి జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్, ఏపీ కృష్ణారావు, ఎం.నాగమల్లేశ్వరరావు, జి.అరుణమ్మ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

కశింకోట టీడీపీ మండల అధ్యక్షుడిగా 'గొంతిన'



శ్రీనివాసరావును సత్కరించి స్వీటు తినిపిస్తున్న తాతయ్యబాబు, పీలా గోవింద

కశింకోట, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల అధ్యక్షుడిగా సోమవరం గ్రామానికి చెందిన గొంతిన శ్రీనివాసరావును నియమించినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు బుధవారం ప్రకటించారు. ఈ మేరకు అనకాపల్లి టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతనంగా నియామకమైన శ్రీనివాసరావును ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, టీడీపీ నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్‌కుమార్, కలగ సోమేశ్వరరావు, ఉల్లింగల రమేష్, నైనంశెట్టి రమణారావు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

'బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుపై పోరాటానికి అడ్డంకులు'



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఏర్పాటు చేయనున్న బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేక ఉద్యమంపై నిర్బంధాన్ని అంతా ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.దొరబాబులు అన్నారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. రాజయ్యపేట వద్ద 1270 ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేయాలని ఆగస్టు ఆరో తేదీన ప్రభుత్వం ప్రజాభిప్రాయసేకరణ చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్కు ఏర్పాటు చేయవద్దని ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పార్కు ఏర్పాటుకు అవసరమైన పనులు నిర్వహిస్తుందని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా మత్స్యకారులు 25 రోజులుగా శాంతియుతంగా పోరాటం చేస్తున్నారన్నారు. ఈ పోరాటాన్ని అణిచివేసేందుకు ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కొణతాల హరనాథబాబు, బీఎస్పీ నాయకుడు సూదికొండ మాణిక్యాలరావు, వామపక్ష నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, ఆర్.శంకరరావు, ఆర్.రాము, వైఎస్ భద్రం, కోరిబిల్లి శంకరరావు పాల్గొన్నారు.

అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదు

▸▸ డివిజన్, మండల స్థాయిలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి ▸▸ ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారం

▸▸ వివిధ అంశాలపై రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్





కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరైన రెవెన్యూ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పీజీఆర్ఎస్, రీసర్వే, ఎంఎల్‌సీసీ, ఐవీఆర్ఎస్, నీటి తీరువా, కోర్టు కేసులు, సివిల్ సప్లై, స్మార్ట్ కార్డుల పంపిణీ, ఆర్‌వోఆర్ కోర్టు, దీపం-2 పథకం రీపేమెంటు, ఓటరు మ్యాపింగ్ తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐవీఆర్ఎస్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చే విధంగా పనిచేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి రశీదు అందించాలని వివరించారు. అర్జీదారునితో అధికారులు స్వయంగా మాట్లాడి సమస్యను పరిష్కరించాలని, ముఖ్యంగా అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కార విధానం ఉండాలన్నారు. ప్రభుత్వ భూములను సర్వే చేయాలని, ఎక్కడైనా ఆక్రమణలను గుర్తిస్తే సదరు ఆక్రమణదారులకు నోటీసులు అందజేయాలని ఆదేశించారు. మండల స్థాయి సమన్వయ కమిటీకి సిఫార్సు చేసిన సివిల్ కేసులను శతశాతం పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కుటుంబ సభ్యుల మధ్య సివిల్ తగాదాల్లో వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా పరిష్కారం చూపాలన్నారు. నీటి తీరువా వసూలు పెంచాలని, నిర్దేశించిన మొత్తాలను వసూలు చేయాలని చెప్పారు. కోర్టు కేసులు పూర్తి చేయాలని, ప్రతి శనివారం ఆర్‌ఓఆర్ కోర్టు నిర్వహించాలని సూచించారు. ఓటరు జాబితాకు సంబంధించి ఓటరు వెరిఫికేషన్ పూర్తి చేసిన అనంతరం ప్రతి ఓటరు మ్యాపింగ్ చేయాలన్నారు. ఫారం-6కు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, రెవెన్యూ డివిజనల్ అధికారులు వి.వి.రమణ, షేక్ ఆయిషా, జిల్లా సవిల్ సప్లై అధికారి మూర్తి, సర్వే సహాయ సంచాలకులు గోపాలరాజు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రజా ఉద్యమం కావాలి

▸▸ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ డైరెక్టర్ రత్నాకర్



గౌరీ గ్రంథాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న డైరెక్టర్ రత్నాకర్ తదితరులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా మార్చాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం జరుగుతుందని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) డైరెక్టర్ పి.రత్నాకర్ అన్నారు. పట్టణంలోని గౌరీ గ్రంథాలయంలో బుధవారం జరిగిన 'స్వచ్ఛత' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పేందుకు దేశవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. రీసైక్లింగ్, పునర్వినియోగం, బయోమైనింగ్, బయో రిమిడియేషన్ ద్వారా పాత డంపింగ్ యార్డులను శుభ్రం చేసి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొన్న వారు మై జీఓవి/యాప్‌లో నమోదు చేసుకుని ఫొటోలను జతపరచడం ద్వారా సర్టిఫికెట్ పొందవచ్చునని వివరించారు. అంతకు ముందు గ్రంథాలయంలో నిరుపయోగంగా ఉన్న వస్తువులు, చెత్తా చెదారాన్ని అంతా కలిసి తొలగించారు. ఈ కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకట రమణ, రోటరీ క్లబ్ అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, గ్రంథాలయ కోశాధికారి ఆడారి మోహనరావు, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, ఎస్ఎం నాయుడు, ఆడారి గంగాధర్, బొడ్డేడ జగ్గ అప్పారావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు, పాఠకులు స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు.



పరవాడ కళాశాల నుంచి ర్యాలీగా బయల్దేరిన ప్రిన్సిపాల్, విద్యార్థులు

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన సదస్సులు



సబ్బవరం కళాశాలలో మాట్లాడుతున్న కెనరా బ్యాంకు అధికారి

పరవాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో చేపట్టిన సంస్కరణల వల్ల అన్ని వర్గాల వారికి ఊరట లభిస్తుందని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు అన్నారు. జీఎస్టీ 2.0పై కళాశాలలో బుధవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేసిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ఏఏ లాభాలు చేకూరుతున్నాయో వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీకుమారి, సత్యనారాయణ, కళ్యాణి, ఉషాకుమారి, లక్ష్మీకాంతం, శేఖర్‌బాబు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం కళాశాలల్లో...

సబ్బవరం : కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన జీఎస్టీ సంస్కరణల వలన అన్నివర్గాల ప్రజలకూ మేలు జరుగుతుందని స్థానిక కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ వడ్డే దుర్గాప్రసాద్ అన్నారు. ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శంకర్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పన్నులు తగ్గడం వలన ప్రజల ఆదాయం పొదుపు అవుతుందన్నారు. వస్తువుల ధరల తగ్గడం వలన పేద, మధ్య తరగతిలో కొనుగోలు శక్తి పెరుగుతుందని వివరించారు. అదేవిధంగా ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇదే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు విద్యార్థులకు పెయింటింగ్, వక్తృత్వ, లఘు దృశ్యమాలి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు ఎం.గోవిందరావు, వీవీజే గోపాలకృష్ణ, వి.రజని తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు జంక్షన్‌లో బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన



వైసీపీ నాయకులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి ఆనుకొని ఉన్న కొత్తూరు జంక్షన్‌ను బుధవారం పోలీస్ అధికారులు పరిశీలించారు. గురువారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాకవరపాలెం మండలంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను సందర్శించేందుకు రోడ్డు మార్గంలో వెళ్లనున్నారు. ఇందులో భాగంగా కొత్తూరు జంక్షన్ వద్ద జగన్మోహన్‌రెడ్డి వాహనం ఆగడంతో పాటు కార్యకర్తలు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో జంక్షన్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తుగానే పోలీస్ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐలు టీవీ విజయ్‌కుమార్, ఎం.వెంకటనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు వితరణ



దాత సమకూర్చిన క్రీడా దుస్తులతో విద్యార్థులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు బుధవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఈ పాఠశాల పూర్వ విద్యార్థి వి.రాజేష్ తన చదువుకున్న పాఠశాల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 55 మందికి ఈ దుస్తులు సమకూర్చినట్టు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్‌వీ నరసింహం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం బ్రహ్మాజీ, ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

అనకాపల్లి, పరిసరాల్లో భారీ వర్షం



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిపోయిన వర్షపునీరు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా అనకాపల్లి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధిక ఉష్ణోగ్రత ఉన్నప్పటికీ సాయంత్రం నాలుగు గంటలు తరువాత ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురియడంతో ప్రజలు ఉపశమనం పొందారు. పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాలువలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపించింది. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో సబ్‌వేలు నుంచి రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఎన్టీఆర్ స్టేడియం ఆవరణ వర్షపునీటితో బురదమయంగా మారింది. గవరపాలెంలోని పలు రహదారులు నీటిమయం కావడంతో పాదచారులు ఇబ్బందులు పడక తప్పలేదు. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద భారీగా నీరు నిలిచిపోవడంతో రెండు ఆర్టీసీ బస్సులు నీటిలో నిలిచిపోయాయి. నీటిలోంచి వస్తుండగా వర్షపునీరు ఇంజన్‌లోకి చేరడం వల్ల ఒక బస్సు నిలిచిపోయినట్లు తెలిసింది. మరో బస్సు సాంకేతిక లోపంతో నిలిచిపోయినట్లు తెలుస్తోంది.

సాయినగర్‌లో వీడని ముంపు సమస్య

కొత్తూరు : ఇక్కడి సాయినగర్‌ను మురుగు, ముంపు సమస్య వీడడం లేదు. బుధవారం కూడా మోకాలు లోతు నీటిలో సాయినగర్ ఉండడంతో స్థానికులు నిరసన చేపట్టారు. నివాసాల్లోకి ఎవరూ రాకపోకలు సాగించలేని విధంగా రహదారులన్నీ నడుంలోతు నీటిలో ఉన్నాయి. సమీపంలో నిర్మాణంలో ఉన్న గట్లు, పునాదులు మీదుగానే రాకపోకలు సాగించారు. ఈ సందర్భంగా రిటైర్డు అధ్యాపకుడు డి.అశోక్ కుమార్, రిటైర్డు ఎస్ఐ అప్పారావు, ఎస్‌బీఐ రిటైర్డు అధికారి సత్యారావు తదితరులు మాట్లాడుతూ ముంపు, మురుగు సమస్యలతో తామంతా కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని వాపోయారు. కొద్దిపాటి వర్షం కురిసినా రాకపోకలు నిలిచిపోయే విధంగా రహదారులన్నీ నీటితో నిండిపోతున్నాయన్నారు. ఈ కారణంగా ఈగలు, దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. తమ సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే పరిష్కరించాలని కోరారు. ముంపు ప్రాంతాన్ని సర్పంచ్ లక్ష్మీప్రసన్న, ఉప సర్పంచ్ అనపర్తి శ్రీను, పంచాయతీ కార్యదర్శి సుభాష్, వార్డు సభ్యుడు తాడి చక్రవర్తి తదితరులు పరిశీలించారు.



విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నీటిలో నిలిచిన బస్సులు



సాయినగర్‌లో వర్షపు నీటిలో నిరసన తెలుపుతున్న స్థానికులు

'బాలికా సాధికారత'పై వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

పరవాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని వాడచీపురుపల్లి సచివాలయం-1, 2 పరిధిలో విద్యార్థినులకు 'బాలికా సాధికారత' అంశంపై బుధవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. స్థానిక హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు ఉత్సాహంగా హాజరయ్యారు. విజేతలకు పాఠశాల హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ రమణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతోన్మాదులపై కఠిన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రాజాన దొరబాబు

తుమ్మపాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : దేశంలో మతోన్మాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై మత్మోనాది రాకేష్ కిశోర్ షూ విసరడం క్షమించరాని నేరమన్నారు. న్యాయమూర్తుల విషయంలోనే రక్షణ కరువైతే సామాన్యుల పరిస్థితి ఏం కావాలని ప్రశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బి.పరమేశ్వరి, వియ్యపురాజు, కోరిబిల్లి శంకరరావు, సత్యనారాయణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తుమ్మపాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : తుమ్మపాల సెక్షన్‌లో ఆర్‌డీఎస్ఎస్ బ్రేకర్ పనుల కారణంగా అల్లిఖానుడుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

'వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి'



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాస్

లంకెలపాలెం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి గొడ్డుపేట, ఎస్సీ బీసీ కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయా ప్రాంతాల్లో ఆయన పర్యటించి స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోకి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటికి బోరు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారికి బదులిచ్చారు ఆయన వెంట స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

'జగన్ పర్యటనను విజయవంతం చేయాలి'

పరవాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం జిల్లాలో చేపట్టనున్న పర్యటనను అంతా విజయవంతం చేయాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా జగన్మోహన్‌రెడ్డి మాకవరపాలెంలో మెడికల్ కళాశాలను సందర్శించనున్నారని వివరించారు. ఉదయం తొమ్మిది గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గం ద్వారా ఎన్ఏడీ, వేపగుంట, సరిపల్లి, అనకాపల్లి బైపాస్ మీదుగా మాకవరపాలెం చేరుకుంటారని పేర్కొన్నారు. వైసీపీ శ్రేణులు వేపగుంటలో జగన్‌కు ఘన స్వాగతం పలికి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సుగంధ ద్రవ్య, ఉద్యాన పంటలకు సాగుకి ఏజెన్సీ అనుకూలం

» రిటైర్డ్ డీడీఏ, మాస్టర్ ట్రైనీ శ్యాం సుందర్‌రెడ్డి



మిరియాలు, పసుపు సాగులో మెలకువలను వివరిస్తున్న శ్యామ్‌సుందర్ రెడ్డి

చింతపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతం సుగంధ ద్రవ్య, ఉద్యాన పంటల సాగుకి అత్యంత అనుకూలమని రిటైర్డ్ వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్, జాతీయ సుస్థిర సుగంధ ద్రవ్యాల కార్యక్రమం మాస్టర్ ట్రైనర్ బి. శ్యామ్ సుందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని యర్రబొమ్మలు పంచాయతీ సాడిక గ్రామంలో సేంద్రియ వ్యవసాయం, పసుపు, మిరియాలు పంటల్లో ఆధునిక సాగు పద్ధతులపై గిరిజన రైతులకు గంటన్నదొర రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీవో) అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు ప్రధాన వాణిజ్య పంటలైన మిరియాలు, పసుపులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధ్యమన్నారు. మిరియాలు పంటలో తెగుళ్ల సకాలంలో గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. బాగా పండిన గింజలను సేకరించి ప్రాసెసింగ్ చేసుకోవడం వల్ల మార్కెట్‌లో ధర లభిస్తుందన్నారు. పసుపు పంటను ఎత్తైన నారు మడుల్లో నాట్లు వేసుకోవాలన్నారు. దుంపలను విత్తనశుద్ధి చేసుకుని నాటు కోవడం వల్ల దుంపకుళ్లు తెగులు నివారించుకోవచ్చునన్నారు. కాఫీ బెర్రీ బోర్ కీటకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గంటన్నదొర ఎఫ్ పీవో సిఈవో మామిడి లోవరాజు, మాతోట ఎఫ్‌పీవో సీఈవో వనపల చిన్నారావు, కాఫీ సేకరణ అధికారి బేర సతీశ్ కుమార్ పాల్గొన్నారు.

గరుగుబిల్లి-ఆంద్ర మధ్య వంతెనకు ప్రతిపాదనలు



గరుగుబిల్లి-ఆంద్ర మధ్యలోగల గెడ్డను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ, నాయకులు

అనంతగిరి, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుబిల్లి- ఆంద్ర మధ్యలో గల గెడ్డపై వంతెన నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ వంతెన నిర్మించాలని స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు.. బుధవారం పంచాయతీరాజ్ ఏఈ సాంబశివరావు గరుగుబిల్లి-ఆంద్ర మధ్యలోగల గెడ్డ వంతెన నిర్మాణంపై పరిశీలించారు. రెండు నెలల క్రితమే ట్రైబల్ వెల్ఫేర్‌శాఖ నుంచి వంతెన నిర్మాణానికి రూ. 1. 50 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్టు ఏఈ తెలిపారు. అనంతరం ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరుమాల నిర్మల మాట్లాడుతూ.. గెడ్డపై వంతెన నిర్మాణం చేపడితే, పార్వతీపురం, విజయనగరం, అల్లూరి మూడు జిల్లాలకు సుమారు 100 గ్రామాలకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోని స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

కాఫీ రైతుల దీక్ష విరమణ



మాట్లాడుతున్న సీలేరు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్

గూడెంకొత్తవీధి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవలసలో రిలే నిరాహార దీక్ష చేపడుతున్న కాఫీ రైతులు ఐటీడీఏ పీవో శ్రీపూజ హామీతో విరమించారు. బుధవారం కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ ఆదేశాలతో పీవో గ్రామంలోని కాఫీ రైతులు చేపడుతున్న దీక్షా శిబిరాన్ని సందర్శించారు. జాతీయ రహదారి నిర్మాణంలో కాఫీ తోటలను కోల్పోతున్న బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని రైతులు పీవోని కోరారు. ఉద్యాన పంటల విలువలో సమస్య తలెత్తడం వల్ల పరిహారం చెల్లింపు జాప్యమైందన్నారు. త్వరలోనే పరిహారం వెంటనే చెల్లిస్తామన్న ఆమె హామీతో బాధిత రైతులు దీక్షను విరమించారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ అన్నాజీరావు పాల్గొన్నారు.

గ్రామ సభలో తీర్మానాలు

సీలేరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు సచివాలయంలో బుధవారం సర్పంచ్ పి.దుర్గో అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి పరశురామ్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం అమలు, పారిశుధ్యం, వార్షిక బడ్జెట్ 2024-2025, 2025-2026 సవరణలు 2026-2027 అంచనా బడ్జెట్ ప్రతిపాదనల ఆమోదంపై వివరించారు. జలజీవన్‌మిషన్ పనులు ప్రగతిపై చర్చించారు. ఇళ్ల పన్ను రివిజన్, ఆస్తి పన్ను వసూలుపై సమీక్షించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై వివరించారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రంలో ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి, ఉపసర్పంచ్ కె.వలీప్రసాద్, కూటమి నాయకులు రాము, సన్యాసిరావు, బబులా, బాలు, గోవింద్ వనముల రాము, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, ఎం.సత్తిబాబు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడిగా చిన్నయ్యపడాల్



అధ్యక్షుడు చిన్నయ్యపడాల్



కార్యదర్శి ఉమా మహేశ్వరరావు

అరకులోయ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో గత మూడురోజులుగా జరుగుతున్న సీఐటీయూ మహాసభలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు నూతన కార్య వర్గ ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా బోనంగి చిన్నయ్య పడాల్, ప్రధాన కార్యదర్శిగా వి.ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా ఎస్.బి.పోతురాజు, సహాయ కార్యదర్శిగా కె.భాగ్యలక్ష్మి, భగత్‌రాం, దీనబంధు, ఎల్.సుందర్‌రావు, రవి, కె.బాలన్న, ఉపాధ్యక్షులుగా కిల్లో మోషియా, జి.సత్యనారాయణ, కుర్ర శంకరరావు, దురియా నాగమ్మ, రేణుక, వెంకటగిరి, ఎల్.బి. రాజ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కార్మికులకు అన్ని విధాలా న్యాయం చేకూరేలా సంఘటితంగా పోరాటాలు చేస్తామన్నారు.



జీఎస్టీ సంస్కరణలను వివరిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న డీఐవో భీమశంకరరావు

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు లబ్ధి

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

పెదబయలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేద ప్రజల పక్షపాతి అని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దుకాణాల వద్దకు వెళ్లి నూతన జీఎస్టీ సంస్కరణలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఆదాయం రాష్ట్ర ప్రజల అవసరాలకు వినియోగించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని స్పష్టం చేశారు. జీఎస్టీ ద్వారా సమకూరుతున్న ఆదాయాన్ని సంక్షేమానికి వెచ్చిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన జీఎస్టీ సంస్కరణలతో సగటున ఓ వ్యక్తికి రూ.15వేల లబ్ధి చేకూరుతుందని వివరించారు. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు గొప్ప ఉపశమనం కలిగిస్తుందని చెప్పారు. కిరాణా సామగ్రిపై గతంలో ఉన్న స్లాబ్ రేట్లు తగ్గించినట్టు చెప్పారు. కొన్నింటిపై జీఎస్టీ తొలగించారన్నారు. ఈ నిర్ణయంపై ప్రజలు హర్షిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాంగి సోనే, పీఏసీఎస్ చైర్మన్ నరంజి ప్రసాదరావు, టీడీపీ నాయకులు పాండురంగ స్వామి, త్రీనాథ్, భూషణం, అబ్దుల్లా, అశోక్, సుబ్బారావు, ధనుంజయ్, తిరుపతిరావు, మేఘరాజు, వెంకటరమణ, జనసేన నాయకుటు ఆనంద్, ప్రశాంత్ , పవన్, కళ్యాణ్, నాగరాజు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కళాశాలల్లో జీఎస్‌టీపై అవగాహన

పాడేరురూరల్: జీఎస్‌సీ సంస్కరణలపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ నూకరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టబ్బాయి ఆధ్వర్యంలో విద్యార్థులకు వకృత్వ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోస్టర్లను ప్రదర్శించి, సంస్కరణలతో ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌టీ అధికారులు, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ అధికారి జి.గౌరీశంకరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ .జూనియర్ కాలేజీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఇంటర్‌బోర్డు అధికారి ఎస్.భీమశంకరరావు పాల్గొని మాట్లాడారు. జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ నూకరాజు, కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వకృత్వ, పెయింటింగ్ పోటీలు



బహుమతులు అందిస్తున్న డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.పద్మ భూషణం

అరకులోయ: సూపర్ జీఎస్‌టీ, సూపర్ సేవింగ్స్‌పై స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాలలో గత రెండు రోజులుగా విద్యార్థులకు వకృత్వ, పెయింటిగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.పద్మభూషణం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్ బహుమతులు ప్రదానం చేసారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ, మాట్లాడుతూ కేంద్రం జీఎస్టీని తగ్గించడంతో కోట్లాదిమంది వినియోగదారులకు ఆర్థికంగా మేలు చేకూరిందన్నారు. ప్రధానోపాధ్యాయుడు మోహనరావు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: పేద, మధ్య తరగతి కుటుంబాలకు జీఎస్టీ 2.0తో ప్రయోజనం చేకూరుతుందని జీఎస్టీ అధికారి జమ్మూ ధర్మపాల్ అన్నారు. బుధవారం స్థానిక గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీఎస్టీ ద్వారా తగ్గిన పన్నులపై ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఆయన సూచించారు. జీఎస్టీతో వెసులుబాటు కల్పించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులకు కృతజ్ఞతలు తెలుపుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు నినాదాలు చేశారు.

సీలేరు: సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జీఎస్టీ 2.0 పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిన్సిపాల్ వి.శంకరరావు మాట్లాడుతూ జీఎస్టీలో సంస్కరణలతో మార్కెట్‌లో వివిధ రకాల వస్తువుల ధరలు భారీగా తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీలేరు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శంకరరావు



జి. మాడుగులలో మానవహారంగా ఏర్పడి నినదాలు చేస్తున్న విద్యార్థులు

సచివాలయ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



పెదబయలు మండల కమిటీలో ప్రతినిధులు

పెదబయలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగుల సమాఖ్య (జేఏసీ) మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. 16 గ్రామ సచివాలయాల్లోని అన్ని విభాల ఉద్యోగులు మండల కేంద్రంలో సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా కిల్లో గణపతి, ప్రధాన కార్యదర్శిగా సమరెడ్డి వరుణ్‌బాబు, కన్వీనర్‌గా ఎం. రాజారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆర్.తరుణ్‌కుమార్, బి.మధుసూదన్, గోపాల్, కోశాధికారిగా ఓ.అరుణ్‌ప్రకాష్ ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

బొర్రమామిడి సమీపంలో కల్వర్టు నిర్మించరూ..



వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు చూస్తున్న గ్రామస్థులు

ముంచంగిపుట్టు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుంగాపుట్టు పంచాయతీ బొర్రమామిడి, సుట్టుగొంది గ్రామాల మధ్య వరదనీటికి కొట్టుకుపోయిన కల్వర్టు స్థానంలో నూతన వంతెన నిర్మించాలని ఆ ప్రాంతీయులు కోరుతున్నారు. గతేడాది కురిసిన వర్షాలకు కల్వర్టు దెబ్బతిందని తెలిపారు. మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు వినతులందించినా ఫలితం కానరాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కల్వర్టు పూర్తి స్థాయిలో కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని సీపీఎం నేత వి.నీలకంఠం, గ్రామస్థులు వి. తిరుపతిరావు, వి. బలరాం, వి.గౌతం, పి.గణపతి, పి.చేతన్ తెలిపారు. అధికారులు ఇకనైనా స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా కోరారు.

పలకలు, పుస్తకాలు వితరణ

సీలేరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం దారకొండ స్కూల్ కాంప్లెక్స్ పరిధికి చెందిన నరమామిడి గొంది ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు దుప్పిలివాడలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సూర్యకళ బుధవారం పలకలు , నోట్‌పుస్తకాలు తన సొంత నిధులతో కొనుగోలు చేసి అందజేసి ఉదారతను చాటుకున్నారు. ఉపాధ్యాయుడు శ్రీను పాల్గొన్నారు.

సంతల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

» అరకు ఏఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లక్ష్మి, పక్కన సభ్యులు

అరకులోయ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వారపు సంతల్లో మౌలిక సౌకర్యాలకు కల్పించాలని అరకులోయ వ్యవసాయ మార్కెట్‌కమిటీ తీర్మానించింది. బుధవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బొరిబొరి లక్ష్మి అధ్యక్షతన సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు వారపు సంతలపై ఆధారపడి క్రయవిక్రయాలు జరుపుతారని చైర్‌పర్సన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ నేపథ్యంలో సంతల్లో తాగునీటి సౌకర్యం, షెడ్లు నిర్మించాలని తీర్మానించామన్నారు. ఈ మేరకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని నిర్ణయించామన్నారు. అలాగే, రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, సంతల్లో మార్కెట్‌కమిటీ ఆధ్వర్యంలో తూకం మిషన్లు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సంతల్లో పర్యటించి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు కంబిడి జ్ఞానప్రకాష్, సభ్యులు, కార్యదర్శి ఎస్. జగ్గన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు ఆన్‌లైన్ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఐటీసీఎంసీకే ప్రథమ జిల్లా కో-ఆర్డినేటర్ తిరుపతిరావు

ముంచంగిపుట్టు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆన్‌లైన్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఐటీసీఎంసీకే ప్రథమ జిల్లా కో-ఆర్డినేటర్ తిరుపతిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం అంగన్‌వాడీలకు నిపుణభారత్ గైడ్‌లైన్స్, మూడు నుంచి ఐదేళ్ల పిల్లల పోషణలో తీసుకోవాల్సిన అంశాలపై శిక్షణనందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు ఎదుగుదలకు పౌష్టిహాహారాన్ని సరిగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధర్మారావు, సీడీపీవో విమలకుమారి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి జానకిరామయ్య

సీలేరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జీకే వీధి మండలం ధారకొండ పీహెచ్‌సీలో బుధవారం వైద్యనిపుణులు జానకీరామయ్య ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 95 మంది కంటి వైద్యపరీక్షలు నిర్వహించగా, 14 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసిన విశాఖపట్నం తరలిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఉచితంగానే ఆపరేషన్ నిర్వహించి తిరిగి తీసుకువస్తామన్నారు. ఎంపీహెచ్‌ఈవో పీవీ రమణ, పీహెచ్‌ఎన్ రాణీ , హెచ్‌వీ కాసులమ్మ పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



రాయిమామిడి గ్రామంలో అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

పెదబయలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణులను సంరక్షించటం మనందరి బాధ్యత అని స్థానిక అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ సుజనశ్రీ పేర్కొన్నారు. బుధవారం వన్య ప్రాణి వారోత్సవాలను నిర్వహించారు. రాయిమామిడి లో మాట్లాడారు. గోమంగి మినీ గురుకులం పాఠశాలలో విద్యార్థులకు వన్య ప్రాణుల రక్షణ, మానవ మనుగడపై అవగాహన కల్పించారు. వన్య ప్రాణులను వేటాడం చట్టరీత్యా నేరమన్నారు.వన్య ప్రాణుల మనుగడతో మానవులకు మేలు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది అనూష, రుక్మిణి, నీలకంఠం, స్థానిక నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డౌనురుకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కొయ్యూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): డౌనూరులో 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులను విద్యుత్ శాఖ సిబ్బంది బుధవారం ఉదయం నుంచి చర్యలు చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపంతో గ్రామంలో రెండు రోజులనుంచి అంధకారం నెలకొంది. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'లో 'డౌనూరు అంధకారం' శీర్షికన కథనాన్ని బుధవారం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొయ్యూరు, డౌనూరు లైన్‌మేన్‌లతో పాటు సిబ్బంది గ్రామానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చర్యలు చేపట్టారు. దీంతో సాయంత్రానికి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

రేషన్ సరకుల సరఫరా వేగవంతం: తహసీల్దార్



భీరం రేషన్ షాపులో సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

జి.మాడుగుల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులకు సరకుల సరఫరా వేగవంతం చేయాలని తహశీల్దార్ రాజ్‌కుమార్ సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని బుధవారం నుర్మతి, భీరం పంచాయతీల డీఆర్‌డిపోలు, సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. నిత్యావసరాల రికార్డులను పరిశీలించారు. నాణ్యమైన సరుకులు అందించాలని సూచించారు. రేషన్ సరకుల పంపిణీలో అవకతవకాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. రెవెన్యూ, జీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాక్స్ పరిధి కాఫీ రైతులకు బోనస్

» రెండో విడతగా కిలోకి రూ.8 చొప్పున అందజేత

» ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ



మ్యాక్స్ బోర్డు సభ్యులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ

చింతపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ది విశాఖ చింతపల్లి ట్రైబల్ కాఫీ ప్రొడ్యూసర్ మ్యాక్స్ లిమిటెడ్(మ్యాక్స్) పరిధి కాఫీ రైతులకు 2024-25 వార్షిక సంవత్సరానికి రెండో విడత బోనస్ కిలోకి రూ.8 చొప్పున చెల్లిస్తున్నట్టు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ తెలిపారు. బుధవారం స్థానిక ఏకో పల్పింగ్ యూనిట్‌ని ఆమె సందర్శించారు. అనంతరం ఏపీవో వెంకటేశ్వరరావుతో కలిసి ఐటీడీఏ పీవో మ్యాక్స్ బోర్డు సభ్యులు, కాఫీ ఐటీడీఏ హెచ్‌సీ, ఎఫ్‌సీలతో సమావేశమయ్యారు. 2025-26లో కాఫీ మార్కెటింగ్‌పై ఆమె తొలుత చర్చించారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ 2024-25 లో మ్యాక్స్ ద్వారా ఏజెన్సీ 11మండలాల గిరిజన రైతుల నుంచి 621మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను సేకరించామన్నారు. ఈ కాఫీ పండ్లను ఎకో పల్పింగ్ యూనిట్‌లో ప్రాసెసింగ్, పార్చిమెంట్ ఉత్పత్తి చేసి అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించినట్టు చెప్పారు. గిరిజన రైతులు మ్యాక్స్‌కి అందజేసిన కాఫీ పండ్లకు తొలివిడతగా కిలోకి రూ.44 ధర చెల్లించామన్నారు. కాఫీ పార్చిమెంట్ మార్కెటింగ్ అనంతరం కిలోకి రూ. 8 చొప్పున మొదటి విడత బోనస్ చెల్లించామన్నారు. తాజాగా రెండో విడత బోనస్ కిలోకి మరో రూ. 8 చెల్లించేందుకు మ్యాక్స్ బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నగదు రైతులు వ్యక్తిగత ఖాతాల్లో చేయనున్నారన్నారు. 2024-25లో గిరిజన కాఫీ రైతులు కాఫీ పండ్లను మ్యాక్స్ ద్వారా మార్కెటింగ్ వల్ల కిలోకి గరిష్ఠంగా రూ.60 ధర లభించిందన్నారు. ఈఏడాదీ అంతర్జాతీయ ధరలు పొందాలన్నారు. దళారులను ఆశ్రయించి రైతులు మోసపోరాదన్నారు.

మ్యాక్స్ అధ్యక్షుడిగా జనకాని సింహాచలం

ది విశాఖ చింతపల్లి ట్రైబల్ కాఫీ ప్రొడ్యూసర్ మ్యాక్స్ లిమిటెడ్(మ్యాక్స్)నూతన అధ్యక్షుడిగా జనకాని సింహాచలం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఐటీడీఏ పీవో శ్రీపూజ తెలిపారు. బుధవారం పీవో ఆధ్వర్యంలో బోర్డు సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మర్రి వెంకట రావు, కార్యదర్శి, కోశాధికారిగా మామిడి గోవిందరావు ఎన్నికయ్యారు.కార్యక్రమంలో ఐటీడీఏ కాఫీ ఏడీ ఎల్. బొంజుబాబు పాల్గొన్నారు.

వివాదాస్పద భూములపై విచారణ



ఐటిడిఏ పీవోకు సమస్యలు వివరిస్తున్న రాజేంద్రపాలెం సర్పంచ్ సింహాచలం

కొయ్యూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 516 ఈ నిర్మాణానికి సేకరించిన భూములకు సంబంధించి పరిహార చెల్లింపు సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు పాడేరు ఐటీడీఏ పీవో శ్రీ పూజ తెలిపారు. హైవేకు సేకరించిన భూముల్లో వలసంపేట, పెద మాకవరంలకు సంబంధించి 20 సర్వే నంబర్లకు సంబంధించిన భూములపై నెలకొన్న వివాదాలతో 2021 నుంచి వీటికి మంజూరైన నష్టపరిహారం హోల్డ్‌లో పెట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పీవో సమగ్ర విచారణ జరిపారు. అనంతరం స్థానిక ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు పీవోను కలసి కాకరపాడు-కొయ్యూరు మధ్య విస్తరణతోపాటు కొండవాగు ప్రవాహాలపై వంతెనలు నిర్మించాలని కోరారు. గొడుగులమ్మబంధకు రహదారి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రాజేంద్రపాలెం సర్పంచ్ పీటా సింహాచలం గ్రామంలో శ్మశాన వాటిక రహదారి మధ్య కొండవాగుపైన వంతెనల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని కోరుతూ వినతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యువో క్రాంతికుమార్, డీటీ కుమారస్వామి పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు నిత్యాన్నదానం

పాడేరురూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్ సమీపాన అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులకు నిత్యాన్నదానాన్ని ఆలయ ధర్మకర్త, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు బుధవారం ప్రారంభించారు. ఏజెన్సీలో అయ్యప్పమాలధారణ భక్తుల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని సుబ్బారావు కోరారు. అయ్యప్ప స్వామి ప్రసాద సేవా కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ధర్మకర్త సుబ్బారావు



దుర్గాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే రాజు

ఆధ్యాత్మికతతో ప్రశాంత వాతావరణం

» ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆధ్యాత్మికత ద్వారా ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మండలంలోని రాయపురాజుపేటలో బుధవారం దుర్గాలమ్మవారి విగ్రహం పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని, తద్వారా ప్రశాంతంగా జీవించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, సర్పంచ్ రాముునాయుడు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేయించుకోండి



కొత్తమల్లంపేటలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న మోహన్‌రావు

గొలుగొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదు పక్కాగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మండలంలోని కొత్తమల్లంపేట గ్రామంలో బుధవారం ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ భూములకు ఈ-పంట నమోదు చేసే విధంగా సిబ్బంది చూడాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, ఇతర పంటలకు నిర్దేశిత సమయంలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ నెల 25వ తేదీలోగా రైతులు పక్కాగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే వరి పంటను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని, రైతులకు అందుబాటులో ఉండి సూచనలు సలహాలు అందించాలని వ్యవసాయ సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఏడీఏ శ్రీదేవి, మండల వ్యవసాయ శాఖాధికారి సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ టైప్-4 పాఠశాల ప్రారంభం



పాఠశాలను ప్రారంభిస్తున్న హైస్కూల్ కమిటీ సభ్యురాలు

మాకవరపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ టైప్-4 పాఠశాల భవనాన్ని తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ ఎల్.భవాని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నారాయణరావు మాట్లాడుతూ 9, 10 తరగతుల బాలికలతో పాటు ఇంటర్ బాలికలకు హాస్టల్ సదుపాయం ఈ పాఠశాలలో సమకూరుతుందన్నారు. ఇంటర్‌లో బాలికలకు 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు సత్యవేణి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్వెప్పాత్రుడు, ఉప సర్పంచ్ లాలం రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దమ్ముంటే మెడికల్ కళాశాల జీవో చూపాలి

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర



విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నేత సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దమ్ముంటే మెడికల్ కళాశాల జీవో చూపించి రండి అంటూ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర వైసీపీ అధినేత జగన్‌కు సవాల్ విసిరారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో కనీసం లిఫ్ట్ బాగు చేయించలేని మీరు, మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకే జగన్ మాకవరపాలెం పర్యటనకు వస్తున్నారన్నారు. జగన్ మాటలను నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. కేంద్రం అనుమతులు లేకుండా నర్సీపట్నం మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పటికైనా చౌకబారు బాటలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

పొట్టిదొరపాలెం పీఏసీఎస్ పాలకవర్గం బాధ్యతల స్వీకారం



త్రిసభ్య కమిటీ సభ్యులను సన్మానిస్తున్న చోడవరం ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టిదొరపాలెం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ పాలకవర్గ ప్రతినిధులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కమిటీ చైర్మన్‌గా విరోతి సత్తిబాబు, సభ్యులుగా తాడి అప్పారావు, మండపాక బాబూరావులు జీవీఎం ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సమక్షంలో వీరు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పాలకవర్గ ప్రతినిధులను పూలమాల వేసి సత్కరించారు. ఎమ్మెల్యే ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయదారులకు విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించాలని, సేవలు విస్తృతం చేయాలని సూచించారు. కమిటీ చైర్మన్ విరోతి సత్తిబాబు మాట్లాడుతూ తమ నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే రాజుకు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్లు దొడ్డి కిశోర్, కోట సత్యనారాయణ, దొండిన అప్పలనాయుడు, సాయిరం శేషు, నాయకులు జి.కోటేశ్వరరావు, కె.రవి, ఎం.తాతీలు, వి.అప్పారావు, ఎ.శ్రీను, రైతులు పాల్గొన్నారు.

లింగాలతిరుగుడు-వెంకన్నపాలెం రోడ్డుకు మోక్షం

» 8.6 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.3.5 కోట్లు విడుదల

» ఇక విశాఖపట్నం వరకు సజావుగా ప్రయాణం

» ప్రయాణికులు, వాహన చోదకుల హర్షం



అభివృద్ధి కానున్న వెంకన్నపాలెం రహదారి ఇదే..

చోడవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): లింగాలతిరుగుడు-వెంకన్నపాలెం రహదారికి మోక్షం లభించింది. దాదాపు 8.6 కిలోమీటర్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.3.5 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో రోడ్డు పనులు పూర్తయితే విశాఖపట్నం వరకు ప్రయాణ సమస్య తీరుతుంది. బీఎన్ రోడ్డులోని మండలంలోని వెంకన్నపాలెం నుంచి నర్సీవరం మండలం లింగాలతిరుగుడు గ్రామం వరకు 8.6 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటేనే ప్రయాణికులు, వాహన చోదకులు హడలిపోతున్నారు. ఈ క్రమంలో రహదారి అభివృద్ధికి మూడున్నర కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన వెయ్యి కోట్ల రూపాయలతో భాగంగా ఈ నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎంతోకాలంగా అభివృద్ధికి నోచుకోకుండా కేవలం తాత్కాలిక మరమ్మతులకే పరిమితమైన ఈ రోడ్డును ఎట్టకేలకు అభివృద్ధి చేయనున్నారు. దీంతో వెంకన్నపాలెం జంక్షన్ నుంచి నర్సీవరం వరకు ప్రయాణం సాఫీగా సాగడానికి మార్గం సుగమమం కానుంది. వెంకన్నపాలెం జంక్షన్ నుంచి లింగాల తిరుగుడు గ్రామం వరకూ రోడ్డు పాడైన ప్పటికీ, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరింతగా దెబ్బతింది. ఈ పరిస్థితుల్లో రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో స్థానికంగా హర్షం వ్యక్తం అవుతున్నది.

ఎన్‌డీబీ పథకంలో లేనందునే నిధులు మంజూరు

వాస్తవానికి బీఎన్ రోడ్డులో భాగమైన నర్సీవరం వెంకన్నపాలెం రోడ్డు ఎన్‌డీబీ గ్రాంటు కింద చేపట్టిన రోడ్డులో భాగం కానందున, ఈ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. ఎన్‌డీబీ నిధులతో ఇప్పటికే మండలంలోని గండవరం, వెంకన్నపాలెం నుంచి చోడవరం మీదుగా నర్సీపట్నం వరకూగల రోడ్డు పనులు ప్రారంభమైనందున, ఈ రోడ్డుల్లో ఐత్రత్తా నిర్వహణ గ్రాంటు విడుదలకు అవకాశం లేకపోవడంతో, ఎన్‌డీబీ నిధులతో బీఎన్ రోడ్డు పనులు పూర్తయ్యేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సి ఉంది.

బీఎన్ రోడ్డు సమస్యకు పరిష్కారం చూపండి

» సీఎం చంద్రబాబుకు నియోజకవర్గ జనసేన నేత లేఖ



సీఎం చంద్రబాబుకు పంపించిన లేఖను చూపిస్తున్న జనసేన ఇన్‌చార్జి రాజు

చోడవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న బీఎన్ రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడుకు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు బుధవారం లేఖ రాశారు. సీఎం కార్యాలయానికి పంపించిన ఈ లేఖను పార్టీ నాయకులతో కలిసి బుధవారం నిర్వహించిన సమావేశంలో మీడియాకు విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతంలో కీలకమైన బీఎన్ రోడ్డు వైసీపీ హయాం నుంచి అధ్వానంగా ఉండిపోయిందని, ఎన్‌డీబీ పథకం కింద పనులు చేపట్టిన ఈ రహదారికి వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గత ఐదేళ్లు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే బీఎన్ రోడ్డు పనులు పూర్తి చేస్తామని, కూలిపోయిన వంతెనలు నిర్మిస్తామని హామీలు ఇచ్చామని గుర్తు చేశారు. ఈ రహదారిలో కూలిన వంతెనల కారణంగా ఇప్పటికే ఇద్దరు మృతి చెందారని, నిత్యం అనేక వేల మంది నానా కష్టాలు పడుతూ ప్రయాణాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు తక్షణమే జోక్యం చేసుకుని బీఎన్ రోడ్డు పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని లేఖలో పీవీఎస్ఎన్ రాజు విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబుకు పంపించిన ఈ లేఖ నకలును డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పంపించినట్టు ఆయన తెలిపారు.

పేద విద్యార్థులకు నిధులు కేటాయించాలి



పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎస్ఐ

నాతవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ కమిటీల సభ్యులు నిరుపేద విద్యార్థుల పుస్తకాల కోసం కొంత సొమ్ము కేటాయించాలని ఎస్ఐ తారకేశ్వరరావు సూచించారు. మండలంలోని మాధవనగరంలో నల్లగొండమ్మతల్లి ఉత్సవ కమిటీ ఇచ్చిన నిధులతో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ కొనుగోలు చేసి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు మార్గంలో పడకుండా పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను తానే అందిస్తానని ప్రకటించారు. అలాగే గ్రామ కమిటీల సభ్యులు సహకరించాలని కోరారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ సూచించారు.

పిడుగుపడి ఒకరి మృతి

» మరొకరికి గాయాలు



పిడుగుపాటుకు మృతి చెందిన రమణ

చింతపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం పంచాయతీ చిన్నకొత్తపాలెంలో పిడుగు పడి ఒకరు మృతిచెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. వీఆర్వో విష్ణు, గ్రామస్థుల కథనం ప్రకారం అనకాపల్లి జిల్లా నాతవరం మండలం మన్యపురట్ల గ్రామానికి చెందిన ముత్త రమణ(50), పోలుపర్తి రాంబాబు చెన్నవరం పంచాయతీలో ఓ గిరిజనుడికి నగదు అప్పు ఇచ్చేందుకు బుధవారం వచ్చారు. నగదు అందజేసి మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. దారిలో మామిడిపల్లి వద్ద అల్పాహారాన్ని కొనుగోలు చేశారు. చిన్నకొత్తపాలెంలో ఒక చెట్టు కింద కూర్చుని అల్పాహారం తింటున్నారు. ఈ సమయంలో వర్షం మొదలై ఉరుములు, మెరుపులతో పిడుగులు పడ్డాయి. ముత్త రమణకు అతి సమీపంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాంబాబు స్పృహ కోల్పోయాడు. అటుగా వెళుతున్న వారు వచ్చి రాంబాబుకు సపర్యలు చేశారు. సుమారు అరగంట తరువాత అతను స్పృహలోకి వచ్చాడు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. రమణ మృతదేహాన్ని చింతపల్లి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తీసుకొచ్చారు.

రూ.6.55 కోట్లతో రహదారుల నిర్మాణం

నాతవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో రూ.6.55 కోట్లతో రహదారులు నిర్మిస్తున్నట్టు తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ తెలిపారు. తాండవ సెంటర్-నాతవరం రూటులో ఎఆర్‌ఘాటం వద్ద రూ.1.35 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించనున్న రోడ్డుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎ.అగ్రహారం నుంచి ఊటమర్ల వరకు రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. అలాగే పీకే గూడెం నుంచి లక్ష్మీపురం వరకు రూ.50 లక్షల నాబార్డు నిధులతో రోడ్డు పనులు చేపడతామన్నారు. మాకవరపాలెం మండలంలో రూ.1.45 కోట్లు, గొలుగొండ మండలంలో రూ.2 కోట్లతో రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ ఎ.మాణిక్యం, మాజీ ఎంపీపీలు పి.కొండబాబు, ఎన్.విజయకుమార్, నీటి సంఘాల అధ్యక్షులు ఎస్.రేమయ్య, ఎం.ప్రసాద్ తెలుగురైతు ఉపాధ్యక్షుడు సీతారామ్మూర్తి, తెలుగుయువత నేత శెట్టి లోవ పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సత్యనారాయణ

చీడపీడల నివారణకు సకాలంలో చర్యలు



శిరిజాంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

చీడికాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వరి పంటకు సోకుతున్న చీడపీడలను నివారించేందుకు శాస్త్రవేత్తలు, అధికారుల సూచనల మేరకు సకాలంలో సహాయక చర్యలు చేపట్టాలని కింతలి వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. మండలంలోని శిరిజాం గ్రామంలో బుధవారం రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కొండెంపూడి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల పర్యవేక్షణలో రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ముఖ్యంగా వరి పంటలో ఆకుముడత పురుగు ఉన్నట్టు గుర్తించారు. వీటి నివారణకు పొలానికి ముందుగా నీటినిపెట్టి క్లోరోఫైరిపాస్ 20 లీటర్ల నీటికి రెండు ఎంఎల్ మందును కలిపి సాయంత్రం సమయంలో పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు అరుణ్‌మణికంఠ, దుర్గాప్రసాద్‌గోపీనాథ్, యోహాన్‌నాయక్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

» ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి

కృష్ణాదేవిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి సూచించారు. చోద్యం, ఏఎల్ పురం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులతో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలని కోరారు. పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేశారు. సిబ్బంది పనితీరు, పౌష్టికాహారం అందుతుందా? లేదా? అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు శ్రీనివాసరావు, కృష్ణప్రసాద్, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వరహా నదిలో పడి వ్యక్తి గల్లంతు

నర్సీపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న కెల్లా భాస్కర్ (35) బుధవారం గెడ్డలో పడి గల్లంతైనట్టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. నర్సీపట్నంలో బంధువు అంత్యక్రియల కోసం మరి కొంత మందితో భాస్కర్ వెళ్లాడని కుటుంబీకులు చెప్పారు. అనంతరం లింగాపురం మార్గంలోని వరహా నదిలో దిగగా, ప్రమాదశాత్తు కొట్టుకుపోయినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

దేవరాపల్లిలో భారీ వర్షం

దేవరాపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. ఉదయం ఎండ కాగా, మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మేఘాలు కమ్ముకుని భారీగా వర్షం పడడంతో రహదారులు జలమయమయ్యాయి. చెరువుల్లో పూర్తి స్థాయిలో నీరు చేరింది. ఆ సమయంలో రోడ్లపై ఏమీ కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఈ వర్షం మెరక ప్రాంత వరి పంటలకు మేలు చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా నాగజ్యోతి



నాగజ్యోతి

రోలుగుంట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న అంతర్జాతీయ క్రీడాకారిణి వీఎం నాగజ్యోతి జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా ఎంపికయ్యారు. నేషనల్ పవర్ లిఫ్టర్స్ ఫెడరేషన్ (ఎన్‌పీఎఫ్) ఆమెను ఎంపిక చేసింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్ఐపీఎఫ్, కర్ణాటక స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్-2025 పోటీలు ఈ నెల 9, 10, 11, 12 తేదీల్లో బెంగళూరులో జరుగనున్నాయి. ఆయా పోటీల్లో నాగజ్యోతి రిఫరీగా వ్యవహరిస్తారు. ఇప్పటికే నాగజ్యోతి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించారు. సేవా భావం, క్రీడా స్ఫూర్తి, పవర్ లిఫ్టింగ్ రంగంలో చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం లభించడం గర్వకారణమని ఈ సందర్భంగా నాగజ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాభిమానులు, సహచర ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

దివ్యాంగునికి ఆర్థిక సాయం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్.శివరాంపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడు దేవర చిలుకునాయుడుకు టీడీపీ నాయకులు సమకూర్చిన నగదును ఎమ్మెల్యే రాజు బుధవారం అందజేశారు. భార్యాపిల్లలతో విశాఖపట్నం ఆస్పత్రికి వెళ్తుండగా మార్గమధ్యంలో జరిగిన ప్రమాదంలో చిలుకునాయుడు భార్య మరణించారు. దీంతో ఆతని కుటుంబానికి టీడీపీ కార్యకర్తలు సాయంగా నిలిచారు. చిలుకునాయుడు చిన్న పిల్లలను చూసి చలించిన ఎమ్మెల్యే అవసరమైన సహాయం తప్పకుండా అందజేస్తానని హామీ ఇచ్చారు. అలాగే దివ్యాంగ పింఛన్ వచ్చేసా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ జి.సత్యనారాయణ, నాయకులు ఎస్.రమేశ్, కోట సత్యనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు, కోరుకొండ రవి, ముచ్చకర్ల తాతీలు, అద్దూరి శ్రీను, ఎలంకాయల అప్పలనాయుడు, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులను నిరోధించండి


కెజోంపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన బెల్టుషాపుల్లో అక్రమ మద్యం ఏరులై పారుతుందని, ఎక్సైజ్ అధికారులు నిద్రమత్తులో ఉన్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు ఆరోపించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. ఇటీవల మండలంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఏదైనా అక్రమ దందాగా మద్యం వ్యాపారులు బరి తెగిస్తున్నారు. మండలంలోని ప్రతీ గ్రామంలో విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపులు నిర్వహణ చేస్తున్నారని, ప్రభుత్వం కేటాయించిన లైసెన్స్ షాపులకు, అనుబంధంగా గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహిస్తున్నారన్నారు. చిన్న పిల్లలు, మహిళలు నిత్యం తిరుగుతున్న రోడ్లు పక్కన బెల్టుషాపులు నిర్వహించడం చట్టాన్ని విస్మరించడమేనని తెలిపారు. గ్రామాల్లో బెల్టుషాపులు పూర్తిగా నిరోధించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదు

» డివిజన్, మండల స్థాయిలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి » ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారం

» వివిధ అంశాలపై రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్





కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరైన రెవెన్యూ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పీజీ ఆర్ఎస్, రీసర్వే, ఎంఎల్ఏసీ, ఐటీఆర్ఎస్, నీటి తీరువా, కోర్టు కేసులు, సివిల్ సప్లై, స్మార్ట్ కార్డుల పంపిణీ, ఆర్ఓఆర్ కోర్టు, డీపం-2 పథకం రీ వెరిఫికేషన్, ఓటరు మ్యాపింగ్ తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చే విధంగా పనిచేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి రశీదు అందించాలని వివరించారు. సమస్యలపై అధికారులు స్వయంగా మాట్లాడి సమస్యను పరిష్కరించాలని, ముఖ్యంగా అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కార విధానం ఉండాలన్నారు. ప్రభుత్వ భూములను సర్వే చేయాలని, ఎక్కడైనా ఆక్రమణలను గుర్తిస్తే సదరు ఆక్రమణదారులకు నోటీసులు అందజేయాలని ఆదేశించారు. మండల స్థాయి సమన్వయ కమిటీకి సిఫార్సు చేసిన సివిల్ కేసులను శతశాతం పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కుటుంబ సభ్యుల మధ్య సివిల్ తగాదాల్లో వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా పరిష్కారం చూపాలన్నారు. నీటి తీరువా వసూలు పెంచాలని, నిర్దేశించిన మొత్తాలను వసూలు చేయాలని చెప్పారు. కోర్టు కేసులు పూర్తి చేయాలని, ప్రతి శనివారం ఆర్ఓఆర్ కోర్టు నిర్వహించాలని సూచించారు. ఓటరు జాబితాకు సంబంధించిన ఓటరు వెరిఫికేషన్ పూర్తిచేసిన అనంతరం ఓటరు మ్యాపింగ్ చేయాలన్నారు. ఫారం-6కు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ జాహ్నవి, డీఆర్ఓ వై.సత్యనారాయణరావు, రెవెన్యూ డివిజనల్ అధికారులు వీవీరమణ, షేక్ ఆయాషా, జిల్లా సివిల్ సప్లై అధికారి మూర్తి, సర్వే సహాయ సంచాలకులు గోపాలరాజు పాల్గొన్నారు.

ముందు చూపు లేకుంటే ముప్పే!



కంటి సంరక్షణపై అంతా ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- నిర్లక్ష్యం వల్ల చిన్న వయస్సు పిల్లల్లోనే అంధత్వ సమస్యలు
- విద్యార్థుల్లో పెరుగుతున్న దృష్టి దోషం
- నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం

చోడవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): 'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అన్నారు పెద్దలు. కళ్లపై చూపిస్తున్న నిర్లక్ష్యం కారణంగా చిన్న వయస్సు పిల్లల్లోనే అంధత్వ సమస్యలు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పిల్లల కంటి ఆరోగ్యంపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపించకపోతే దృష్టి దోషాల బారి నపడి కంటిచూపు కోల్పోయే పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉంది. కళ్ల ఆరోగ్య ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఏటా అక్టోబరు రెండవ గురువారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పాటిస్తున్నారు. కంటి సంరక్షణ ఆవశ్యకతను అందరికీ తెలియజెప్పేందుకు అంధత్వ నివారణ సంస్థ 'మీ కళ్లను ప్రేమించండి' అనే నినాదంతో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది.

కంటికి శ్రమ తగ్గించండి

ప్రస్తుతం పిల్లలు, పెద్దలు గంటల తరబడి సెల్ ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఫలితంగా కళ్లపై విపరీతమైన ప్రభావం పడుతుంది. ఈ పరిస్థితుల్లో పిల్లలు స్ర్కీన్ టైమ్ తగ్గించాలని కంటి వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలాగే కళ్ల ఆరోగ్యానికి అవసరమైన ఆహారంతో పాటు, తగిన జాగ్రత్తలు తీసుకుంటే పిల్లల్లో కంటి వ్యాధులను సులభంగా నివారించేందుకు అవకాశం ఉందని సూచిస్తున్నారు.



అద్దాలు అవసరమైన విద్యార్థులను గుర్తించిన నేత్ర నిపుణులు

విద్యార్థుల కంటి సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

అధికశాతం మందిలో పెరిగిపోతున్న అంధత్వ సమస్యలను గుర్తించిన ప్రభుత్వం, వారికి ఆదిలోనే అవసరమైన వైద్య సాయం అందించే లక్ష్యంతో అంధత్వ నివారణ సంస్థ సహకారంతో పాఠశాలల్లో విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తోంది. అంతేకాకుండా విద్యార్థులకు కంటి ఆరోగ్యంపై అవగాహన కలిగించే కార్యక్రమాలను చేపడుతోంది. ఇదే సమయంలో విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు సరఫరాతో పాటు, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే విద్యార్థులు కంటి ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నేత్ర వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తీసుకునే ఆహారం దగ్గర నుంచి కళ్ల విషయంలో పిల్లలు, పెద్దలు తగిన జాగ్రత్తలు పాటిస్తే, అంధత్వం తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వైద్యులు చెపుతున్నారు.



పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు

కంటి సంరక్షణకు ఇవీ చిట్కాలు...

పిల్లలు పోషకాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. కంటి సంరక్షణకు అవసరమైన ఆకుపచ్చని కూరగాయలు, ఆకుకూరలు తమ ఆహారంలో చేర్చుకోవాలి. అలాగే పండ్లు, చేపలను ఆహారంలో తీసుకోవాలి. పాలు తాగాలి. ఎక్కువ సేపు టీవీ లేదా కంప్యూటర్, సెల్‌ఫోన్లకు అతక్కునిపోవడం తగ్గించాలి. స్ర్కీన్‌ల నుంచి వచ్చే కాంతి వల్ల కళ్లకు కలిగే ఒత్తిడి తగ్గించడానికి మధ్య మధ్యలో కళ్లకు విరామం ఇవ్వాలి. ఇందుకు గాను 20-20-20 నియమాన్ని పాటించాలి. అంటే ప్రతి 20 నిమిషాలకు 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువులను 20 సెకన్లపాటు తీక్షణంగా చూడడం అలవాటుగా చేసుకోవాలి. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడంతో పాటు, కళ్లకు చిరాకు కలిగించే వస్తువుల వాడకానికి దూరంగా ఉండాలి. కంటి నిండా నిద్రపోవడం వల్ల కళ్లకు పూర్తి విశ్రాంతి లభించేలా చూడాలి. దీనివల్ల కళ్ల అలసట తగ్గుతుంది. కంటి సమస్యలు ఉన్నట్టు గుర్తించినట్టయితే తప్పనిసరి కంటి అద్దాలు వాడుతుండాలి.

తల్లిదండ్రుల బాధ్యత ఎక్కువగా ఉండాలి



పిల్లలకు పౌష్టికాహారం ఎక్కువగా అందివ్వాలి. పనికిరాని జంక్ ఫుడ్‌ను ప్రోత్సహించకుండా కంటికి ఆరోగ్యం కలిగించే స్థానికంగా లభించే ఆకుకూరలు ఎక్కువగా పెట్టాలి. పిల్లలు ఎక్కువగా సెల్ ఫోన్ చూడకుండా, టీవీకి అంటుక్కుపోకుండా కట్టడి చేయాలి. ప్రధానంగా పిల్లల కంటి చూపును పట్టించుకోవాలి. వారి కంటిచూపుపై అనుమానం వస్తే తక్షణం నేత్ర వైద్య పరీక్షలు చేయించాలి.

- బీఏ రాజు (నేత్ర వైద్య సహాయకులు), స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక విద్య, జెడ్పీ హైస్కూల్, దిబ్బిడి.

క్రైం... crime news

రైళ్ల నుంచి జారిపడి ముగ్గురు మృతి



వరుణ్ (ఫైల్)

పాయకరావుపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన వివిధ రైళ్ల ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు దుర్మణం పాలయ్యారు. ఇందుకు సంబంధించి తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి. నక్కపల్లి మండలం గొడిచెర్ల కొత్తూరు సమీపంలో బుధవారం ఉదయం విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళుతున్న రైలు నుంచి సుమారు యాభై సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. అలాగే, కొత్తూరు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో పూరీ- తిరుపతి రైలు నుంచి గుర్తు తెలియని సుమారు యాభై సంవత్సరాల వయస్సుగల వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మరణించాడు. అదేవిధంగా బయ్యవరం- కశింకోట రైల్వే స్టేషన్ల మధ్య చెన్నై నుంచి హౌరా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ఒడిశా రాష్ట్రం ఖుర్దా రోడ్డుకు చెందిన వరుణ్ (23) అనే యువకుడు జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద లభించిన సెల్ ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మూడు మృతదేహాలను తుని ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు. మృతుల బంధువులు తుని రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

పాము కాటుతో వార్డు సభ్యుడు మృతి



గోగాడ సన్యాసినాయుడు (ఫైల్ ఫొటో)

కె.కోటపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాము కాటుకు గురై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందారు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. మండలంలోని పైడంపేట పంచాయతీ ఏడవ వార్డు సభ్యుడు గోగాడ సన్యాసినాయుడు (54) ఈనెల ఆరో తేదీ సాయంత్రం పశువుల కోసం పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని కె.కోటపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, ప్రాథమిక చికిత్సల అనంతరం వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ యువకుడి మృతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్టు పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని పిసినికాడ గ్రామానికి చెందిన మళ్ల సాయికుమార్ (28), అతని స్నేహితుడు శరగడం పవన్‌కుమార్‌లు ఈ నెల ఒకటో తేదీన బీఆర్టీ కాలనీలో జరిగే కార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల ఫ్లై ఓవర్ వంతెన పై నుంచి వెళుతుండగా గోతిలో పడి తుళ్లి నేలపై పడ్డారు. గాయాలకు గురైన ఈ ఇద్దరినీ ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఇందులో తీవ్రంగా గాయపడిన సాయికుమార్‌ను విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు అతని తండ్రి గోవిందరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

బార్బడోస్ సదస్సులో స్పీకర్ అయ్యన్న



సదస్సులో పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గొలుగొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : బార్బడోస్‌లో జరుగుతున్న కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌కు ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు రెండో రోజు బుధవారం హాజరయ్యారు. ఈ నెల ఏడో తేదీన ప్రారంభమైన ఈ సదస్సు 12వ తేదీ వరకు జరగనుంది. ఈ సదస్సులో సభాపతులు పాల్గొని తమ అనుభవాలను పంచుకుంటారు.

పాముకు శస్త్ర చికిత్స

- ఆలయంలోకి ప్రవేశిస్తుండగా గేటు వేయడంతో గాయం
- స్నేక్ క్యాచర్ పట్టుకుని పశు వైద్యశాలకు తీసుకు వెళ్లడంతో వైద్యం





చికిత్స చేసిన పామును చూపుతున్న వైద్యుడు శివ, స్నేక్ క్యాచర్ వెంకటేష్ (ఇన్ సెట్) గాయపడిన పాముకు కుట్లు వేసిన దృశ్యం

మాడుగుల రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : గాయపడిన పాముకు పశు వైద్యుడు శస్త్ర చికిత్స చేసిన ఘటన బుధవారం ఇక్కడ చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలివి. మాడుగులలోని బ్రహ్మంగారి ఆలయంలోకి బుధవారం ఉదయం పాము (జెర్రిపోతు) ప్రవేశిస్తుండగా, ఆ సమయంలో అక్కడున్నవారు భయపడి గేటు వద్ద పాము ఉండగా ఒక్కసారిగా గేటు వేశారు. ఆ గేటులో పాము ఇరుక్కుపోయింది. వెంటనే మాడుగులలో ఉండే స్నేక్ క్యాచర్ పెచ్చెట్టి వెంకటేశ్‌కు వారు సమాచారం అందించారు. అతను వెంటనే వచ్చి ఆ పాముని పట్టుకున్నాడు. పాముకి నడుము భాగంలో గాయమైంది. కేజేపురం పశు వైద్యశాలకు తీసుకెళ్లగా, అక్కడి వైద్యుడు డాక్టర్ శివ గతంలో ఉన్న అనుభవంతో పాముకి ముందుగా మత్తు మందు ఇచ్చారు. అనంతరం గాయమైన శరీర భాగానికి శస్త్ర చికిత్స చేసి, కట్లు వేశారు. ఆ తరువాత స్నేక్ క్యాచర్ దానిని మాడుగులకు దూరంగా ఉన్న కొండ ప్రాంతంలో విడిచిపెట్టారు.

మెడికల్ కాలేజీ పేరుతో జగన్ దొంగ నాటకాలు

- అనుమతులు లేకుండా భవనాలు నిర్మించి ప్రజలకు మోసం
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి కుట్ర
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు 'బత్తుల'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు, చిత్రంలో పీలా గోవింద తదితరులు

అనకాపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీ పేరుతో జగన్‌రెడ్డి దొంగ నాటకాలాడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి విఘాతం కలిగించేలా జగన్‌రెడ్డి పగపట్టారని విమర్శించారు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మించి, మాకవరపాలెంలో మెడికల్ కాలేజీ అంటూ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడానికి జగన్‌రెడ్డి కుట్ర పన్నారని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే మాకవరపాలెం మెడికల్ కాలేజీకి గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో చూపించాలని సవాల్ విసిరారు. మాకవరపాలెం చుట్టుపక్కల ప్రాంతాల్లో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే బినామీ ఆస్తుల విలువ పెంచుకోవడానికే మెడికల్ కాలేజీ అంటూ నాటకాలాడుతున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో విశాఖ అభివృద్ధికి వస్తున్న పెట్టుబడులను వైసీపీ నాయకులు అసత్య ప్రచారంతో అడ్డుకోవాలని చూస్తుండడం దుర్మార్గమన్నారు. మెడికల్ కాలేజీ అనుమతులపై వైసీపీ నాయకులు చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. ఈ సమావేశంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, కశింకోట టీడీపీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుత సమాజమే లక్ష్యం కావాలి

- డీఎస్సీ-2025 ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

సబ్బవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుత సమాజమే ఉపాధ్యాయుల లక్ష్యం కావాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో డీఎస్సీ-2025 ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ శిబిరానికి గురువారం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మెగా డీఎస్సీ నిర్వహించిందన్నారు. ఉపాధ్యాయుల కోసం విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా శిక్షణ ఏర్పాటు చేయడం గొప్పవిషయంగా పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ విద్యాబోధన సాగించి తద్వారా విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, అల్లూరి డీఈవో బ్రహ్మాజీ, ఏపీసీ డాక్టర్ ఎ.అప్పలనాయుడు, ఏఎంవో కె.జియా, కోర్సు డైరెక్టర్ సింహాచలం, తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ రెక్టార్‌గా ప్రొఫెసర్ పి.కింగ్



నియామక పత్రం అందిస్తున్న వీసీ

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్‌గా కెమికల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ పులిపాటి కింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ బుధవారం నియామక ఉత్తర్వులను అందజేశారు. రెక్టార్‌గా నియమితులైన ప్రొఫెసర్ పి.కింగ్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్స్ చీఫ్ వార్డెన్‌గా, కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. డాక్టర్ సర్వే పల్లి రాధాకృష్ణన్ బెస్ట్ అకాడమీషియన్ అవార్డును, అమెరికాకు చెందిన ఇండస్ ఫౌండేషన్ టీచింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు.

అప్పన్న ఆభరణాల లెక్కలు చెప్పండి

- స.హ.చట్టం ప్రకారం దరఖాస్తు చేసిన న్యాయవాది

సింహాచలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులకు కానుకల రూపంలో సమర్పించిన రజిత, స్వర్ణ ఆభరణాల్లో వ్యత్యాసాలున్నటు వస్తున్న ఆరోపణలపై సమగ్ర వివరాలు తెలపాలని కోరుతూ అనకాపల్లికి చెందిన స.హ.చట్టం కార్యకర్త, న్యాయవాది కాండ్రేగుల వెంకటరమణ దేవదాయశాఖ కమిషనర్‌కు ఈనెల 7న దరఖాస్తు చేశారు. ఈ అంశంపై 2014 నుంచి నియమించిన కమిటీల వివరాలు, విచారణ నివేదికలను, ఆభరణాల తాజా రిజిస్టర్‌ను వెల్లడించాలన్నారు. ఆభరణాలు భద్రపరిచే విధివిధానాలను, కడప వాసి ప్రభాకరాచారి చేసిన ఫిర్యాదుపై తీసుకున్న చర్యలు, నివేదికలు ఇవ్వాలని కోరారు. దేవస్థానం లెక్కలపై ఆడిట్ అభ్యంతరాలు, అధికారుల సమాధానాలు 2014 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాల కాపీలను ఇవ్వాలని కోరారు.

బాలికల ఐటీఐలో జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఐటీఐ ప్రాంగణంలో గల నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 10వ తేదీ శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉప ప్రాంతీయ ఉపాధి కల్పనాధికారి శ్యామ్‌సుందర్ నిట్టల వివరాలను వెల్లడించారు. మేళాలో ఇన్నోవా, ఎస్ఆర్ అకడమిక్ ఆర్గనైజేషన్ తదితర సంస్థలు రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, టెలీకాలర్స్, రిసెప్షనిస్ట్ తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో వివరాలు, అర్హతలను నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి, గల అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో నేరుగా హాజరుకావాలన్నారు.

ఎంపీపీపై 18న అవిశ్వాస తీర్మానం

... 5వ పేజీ తరువాయి

బలనిరూపణకు అధికారులు సమావేశం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నోటీసుపై ఉన్న నలుగురు సభ్యుల సంతకాలను పరిశీలించిన అధికారులు.. అన్నీ సక్రమంగానే ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేదీ సాయంత్రం మండల పరిషత్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఎంపీపీ గోవిం దరావుపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతారు. నలుగురు సభ్యులు అనుకూలంగా ఓటు వేస్తే, గోవిందరావు పదవి నుంచి వైదొలగాల్సి వస్తుంది. అంతకన్నా ఒక్క ఓటు తగ్గినా అవిశ్వాస తీర్మానం వీగిపోతుంది... గోవిందరావు ఎంపీపీగా కొనసాగుతారు. అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని వైస్ ఎంపీపీలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అచ్యుతాపురం అప్‌గ్రేడ్!

... 5వ పేజీ తరువాయి

పంచాయతీ నుంచి గొర్లెధర్మవరం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా చేశారు. అయితే అధికారులు పాత ప్రతిపాదనలను పక్కనపెట్టి తాజాగా దుప్పితూరు, మోసయ్యపేట, రామన్నపాలెం, వెదురువాడ పంచాయతీలను అచ్యుతాపురంలో విలీనం చేసి నగర పంచాయతీగా చేయాలని నిర్ణయించారు. ఈమేరకు ప్రతిపాదనలు తయారు చేశారు. జిల్లా కలెక్టర్ ద్వారా త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్టు తెలిసింది.

కొత్త టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్

... 5వ పేజీ తరువాయి

మునిసిపల్ పరిధి తప్ప జడ్పీ, ప్రభుత్వ పాఠశాలల్లో భారీగా ఖాళీలు ఉన్నట్టు విద్యాశాఖ గుర్తించింది. తొలుత ఏజెన్సీలో మొత్తం ఖాళీలు భర్తీచేసిన తరువాత మైదానంపై దృష్టిసారించనున్నారు. ఎస్టీటీ కేటగిరీ వరకు చూస్తే డీఎస్సీ ద్వారా నియమితులైన టీచర్లకు పోస్టింగ్స్ ఇచ్చిన తరువాత కూడా ఖాళీలు ఉంటాయని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

ఆయుష్... ఆపసోపాలు!

- డిస్పెన్సరీల్లో నిలిచిన వైద్య సేవలు
- ఇక్కడి వైద్యులకు పీహెచ్‌సీల్లో బాధ్యతలు
- వారం రోజులుగా రోగులకు ఇబ్బందులు
- ప్రత్యామ్నాయం చూపించని అధికారులు



సింహాచలం ఆయుష్ ఆరోగ్య మందిరం

విశాఖపట్నం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సమ్మె ప్రభావం ఆయుష్ డిస్పెన్సరీలపై పడింది. ఆయుష్ వైద్యులకు పీహెచ్‌సీల బాధ్యతలను అప్పగించడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 30 ఆయుష్ డిస్పెన్సరీల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఆయుష్ వైద్య మందిరాల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు అల్లోపతి వైద్యసేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళుతుండడంతో రోగులకు ఇక్కట్లు ఎదురయ్యాయి. పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టడంతో అల్లోపతి వైద్యసేవలు పొందే రోగులకు ఇబ్బందులు ఎదురవకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన ఉన్నతా ధికారులు...ఆయుష్ రోగులను పట్టించుకోకపోవడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు.

సమ్మెలో పీహెచ్‌సీ వైద్యులు

సమస్యల పరిష్కారం కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు రెండు వారాలుగా విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. డిమాండ్లు నెరవేర్చేంత వరకు తగ్గేది లేదని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పీహెచ్‌సీల్లో వైద్య సేవలకు అంతరాయం లేకుండా ఆయుష్ విభాగానికి చెందిన వైద్యులను పంపాలని ఆదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఆయుష్ డిస్పెన్సరీల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లంతా ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రతిరోజూ పీహెచ్‌సీలకు వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. దీంతో ఆయుష్ డిస్పెన్సరీల్లో రోగులకు సేవలు అందని పరిస్థితి నెలకొంది.

30 మందికి బాధ్యతలు..

ఉమ్మడి జిల్లాలోని ఆయుష్ డిస్పెన్సరీల్లో పనిచేస్తున్న సుమారు 30 మంది వైద్యులు ప్రస్తుతం పీహెచ్‌సీల్లో వైద్య సేవలందిస్తున్నారు. పీహెచ్‌సీ బాధ్యతలను చూస్తున్న వారిలో విశాఖ జిల్లా రేవిడి, ఆనందపురం, శొంఠ్యాం, భీమునిపట్నం, మధురవాడ, అడవివరం, సింహాచలం, వేపగుంట, మింది, అగనంపూడి, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, గంపరాయి, డుంబ్రిగుడ, సీలేరు, తాజంగి, అనకాపల్లి జిల్లా సబ్బవరం, తురకలపూడి, రేగుపాలెం, సర్వసిద్ధి, కేజే పురం, వేంపాడు, నర్సీపట్నం, ఎం.కోడూరు, ఎలమంచిలి డిస్పెన్సరీల మెడికల్ ఆఫీసర్లు ఉన్నారు. ఆయా ఆయుష్ డిస్పెన్సరీలకు వెళ్లే రోగులకు వైద్యులు లేరని సిబ్బంది చెబుతున్నారు. కొన్నిచోట్ల సిబ్బంది కూడా లేకపోవడంతో మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529